www.akshratimes.com

తెలుగు దినపత్రిక
# అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం

RNI.NO : APTEL/2022/90211

సంపుటి : 04 సంచిక : 87 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com సోమవారం 14 - 07 - 2026

Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Guntur,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



హైదరాబాద్‌లో 6 ఏళ్ల మనవరాలితో కారు నడిపించిన ఎస్ఐ.. ప్రశ్నించిన జనంతో వాగ్వాదం!

# ధవళేశ్వరం బ్యారేజీకి 117 కొత్త గేట్లు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- వచ్చే ఏడాది జూన్ నాటికి పనులు పూర్తి
- ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ పనులను ప్రారంభించిన చంద్రబాబు
- బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడిన సీఎం
- పిచ్చుకలంక గ్రామంలో రైతులతో ముఖాముఖి
- పవన్ కల్యాణ్ ఆరోగ్యం దృష్ట్యా విశ్రాంతి తీసుకోవాలని సూచించానన్న చంద్రబాబు
- పుష్కరాల లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ
- రూ.152 కోట్లతో ధవళేశ్వరం బ్యారేజీకి 117 కొత్త గేట్ల ఏర్పాటు పనుల ప్రారంభం
- గత ప్రభుత్వం గంజాయిని ప్రోత్సహించిందని, గొడ్డలి పార్టీతోనే సమస్య అని విమర్శ
- త్వరలోనే అఖండ గోదావరి ప్రాజెక్టును తీసుకొస్తామని వెల్లడి



**అమరావతి :** గోదావరి డెల్టా దేశానికే అన్నపూర్ణగా మారిందంటే కాటన్ చొరవే అని సీఎం చంద్రబాబు అన్నారు. బ్రిటీష్ వాళ్లు వెళ్లిపోయినా, కాటన్ దొర విగ్రహాలు పెట్టి గౌరవించుకుంటున్నామన్నారు. మూడు జిల్లాల పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం చేరుకున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ పనులను చంద్రబాబు ప్రారంభించారు. పునరుద్ధరణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. 2014-19 మధ్య కాలంలో ధవళేశ్వరం బ్యారేజీకి 58 కొత్త గేట్లను అప్పటి టీడీపీ ప్రభుత్వం అమర్చింది. ఇప్పుడు సీడబ్ల్యూసీ సూచనల మేరకు మిగిలిన 117 గేట్లకు కొత్త గేట్లను అమర్చే పనులకు కూటమి ప్రభుత్వం - మిగతా 2 లో

## పోలవరం ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించిన సీఎం చంద్రబాబు


- పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన సీఎం చంద్రబాబు
- హెలికాప్టర్ నుంచి పనులను విహంగ వీక్షణం ద్వారా వీక్షించిన సీఎం
- స్పిల్‌వే, కాఫర్ డ్యామ్‌ల మధ్య పనులపై ఆరా
- గ్యాప్ 1, గ్యాప్ 2 పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన
- సీఎం వెంట మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. ఏలూరు జిల్లా పర్యటనలో భాగంగా ఆయన హెలికాప్టర్‌లో ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా వీక్షించారు. స్పిల్‌వే నుంచి గోదావరి వరద నీటి ప్రవాహాన్ని, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య జరుగుతున్న పనులను ఆయన విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. అనంతరం, క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఆరా తీశారు. - మిగతా 2 లో


## అమరావతి క్వాంటమ్ వ్యాలీ వైపు అందరి చూపు

- పోస్ట్ క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ హబ్‌గా అమరావతి
- ఆధునిక క్వాంటమ్ కంప్యూటర్లతో సమాచార గోప్యతకు ముప్పు
- అధిగమించేందుకు కొత్త అల్గారిథమ్స్‌కు వెళ్లాల్సిందే
- అప్పుడు క్వాంటమ్ వ్యాలీ వైపు అందరి చూపు




**అమరావతి :** అన్ని సాంకేతికతల్లాగే క్వాంటమ్ కంప్యూటింగ్ కూడా రెండు వైపులా పదనున్న కత్తి లాంటిదే. సరిగ్గా వాడితే అద్భుతాలు సృష్టించొచ్చు. అదే విద్రోహ శక్తుల చేతుల్లోకి వెళ్తే భారీ విధ్వంసానికి దారి తీయొచ్చు. ప్రస్తుతం ఇలాంటి ముప్పును ఎదుర్కొనేందుకు మన దేశం అడుగులు వేస్తోంది. ఈ కీలక ప్రక్రియలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ (ఏక్యూవీ) అత్యంత ప్రధాన భూమిక పోషించనుంది.ప్రస్తుతం మనం వాట్సప్‌లో - మిగతా 2 లో

## రామాలయం విరాళాల చోరీపై నివేదిక సమర్పించండి



- సిట్‌కు సుప్రీంకోర్టు ఆదేశం
- శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు
- సిట్ దర్యాప్తు పురోగతి నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామన్న సొలిసిటర్ జనరల్

**ఢిల్లీ :** అయోధ్య రామాలయం విరాళాల చోరీపై దర్యాప్తు పురోగతి నివేదికను సమర్పించాలని సిట్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. విరాళాల చోరీ వ్యవహారంపై తగిన వివరణ ఇవ్వాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు, ఇంకా కేంద్రానికి కూడా నోటీసులు జారీ చేసింది. రామాలయంలో భక్తులు సమర్పించిన కానుకల చోరీ వ్యవహారంపై సీబీఐ విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది.రామాలయ వ్యవహారాలను పర్యవేక్షించే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆర్థిక లావాదేవీలపై ఆడిట్ నిర్వహించాలని ఓ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆలయ ట్రస్ట్ వ్యవహారాలు, పరిపాలనకు సంబంధించిన ఆర్థిక అవకతవకలు, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సీబీఐ నేతృత్వంలో దర్యాప్తు చేయాలని కోరారు. కోట్లాది మంది భక్తులు, దాతల విశ్వాసాన్ని నిలబెట్టడానికి అవసరమైన నియంత్రణ, పర్యవేక్షణ, ఆడిట్ - మిగతా 2 లో


## పెళ్లి పేరుతో భారత మహిళలకు వల

- పెళ్లి పేరుతో భారత మహిళలను ట్రాప్ చేస్తున్న జైషే మహమ్మద్
- ఆన్‌లైన్‌లో పరిచయం పెంచుకుని పాకిస్థాన్‌కు రప్పించేందుకు కుట్ర
- జమ్మూకశ్మీర్ నుంచి రాజస్థాన్ సరిహద్దులపైకి ఉగ్రవాదుల దృష్టి
- సామాజికంగా బలహీనంగా ఉన్న యువతులే వీరి ప్రధాన లక్ష్యం



**ఢిల్లీ :** పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (జేఇఎం) ఉగ్రవాద సంస్థ, భారత్‌లో విధ్వంసం సృష్టించేందుకు సరికొత్త, అత్యంత ప్రమాదకరమైన పన్నాగం పన్నింది. ప్రేమ, పెళ్లి పేరుతో భారతీయ మహిళలను వలలో వేసి, వారిని పాకిస్థాన్‌కు తరలించి, ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగించుకోవాలని చూస్తోంది. ఈ కుట్రను భారత నిఘా వర్గాలు (ఐబీ) ఛేదించాయి. - మిగతా 2 లో

## ప్రపంచ నేతలే లక్ష్యంగా ఇరాన్ హిట్‌లిస్ట్




- జాబితాలో ట్రంప్, నెతన్యాహు,మెక్రాన్ సహా 13 మంది ప్రముఖులు !
- అమెరికా, యూరప్ నేతలే లక్ష్యంగా హిట్‌లిస్ట్ ప్రచురించిన ఇరాన్ పత్రిక
- అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారంగానే ఈ జాబితా అంటూ ప్రకటన

## షాబాద్‌లో ఆరు హత్యల కేసు నిందితుడు రాజ్‌కుమార్ మృతి

- షాబాద్ సామూహిక హత్యల ప్రధాన నిందితుడు రాజ్ కుమార్ మృతి
- విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల అనుమానం
- హత్యలకు ముందు రికార్డ్ చేసిన సంచలన సెల్ఫీ వీడియో వెలుగులోకి
- మోసం, ఆర్థిక నష్టమే దారుణానికి కారణమని వీడియోలో వెల్లడి
- భార్యాపిల్లలతో సహా మొత్తం ఆరుగురిని హత్య చేసిన రాజ్ కుమార్





## తెలంగాణలో మళ్లీ ఎండాకాలం!

- సాధారణం కన్నా 4డిగ్రీలు అధికంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- వర్షాకాలంలో ఎండాకాలాన్ని తలపిస్తున్న ఎండలు
- వర్షాలు కురవాల్సిన సమయంలో అధిక ఎండలు
- సాధారణం కన్నా మూడు నుంచి 4.6 డిగ్రీలు అధికంగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. వర్షాలు సంవృద్ధిగా కురవాల్సిన సమయంలో ఎండలు దంచికొడుతున్నాయి. సాధారణం కన్నా రెండు నుంచి నాలుగున్నర డిగ్రీలు అధికంగా నమోదవుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఖమ్మం, - మిగతా 2 లో

## 'సింగరేణి భరోసా యాత్ర' ప్రారంభించిన తెలంగాణ బీజేపీ



- తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయించిన నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం
- హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రారంభం
- కిషన్ రెడ్డి, రాంచందర్ రావు సహా పలువురు నేతలతో 2 రోజుల యాత్రకు శ్రీకారం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ సింగరేణిని నిర్లక్ష్యం చేశాయని ఆరోపణ
- మోదీ ప్రత్యేకంగా ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని వెల్లడి

**హైదరాబాద్ :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)కు కేంద్ర ప్రభుత్వం తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయించిన నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తెలంగాణ బీజేపీ సోమవారం 'సింగరేణి భరోసా యాత్ర'ను ప్రారంభించింది. హైదరాబాద్‌లోని - మిగతా 2 లో

## కన్నెపల్లి నుంచి ఎల్లంపల్లికి నీరు తరలించే అవకాశం లేదు

- దేవాదుల ప్రాజెక్టులో మంత్రుల పరిశీలన
- దేవాదుల ప్రాజెక్టును పరిశీలించిన మంత్రుల బృందం
- వచ్చే వేసవినాటికి పూర్తి చేస్తామని అమాత్యుల ప్రకటన
- ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపణ
- 12 జిల్లాలకు సాగు నీరు అందించేలా ప్రణాళికకు నిర్దేశం



**హైదరాబాద్ :** సాంకేతికంగా కన్నెపల్లి బ్యారేజీ నుంచి నేరుగా ఎల్లంపల్లికి నీళ్లు తీసుకెళ్లే అవకాశమే లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. గేట్లు కిందికి దించి నీటిని నిల్వ చేస్తే మేడిగడ్డ బ్యారేజీ కొట్టుకుపోతుందని మంత్రులు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం నాణ్యతాలోపంతో నాసిరకంగా, లోపభూయిష్టంగా నిర్మించిందని మండిపడ్డారు. దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని సందర్శించిన మంత్రుల బృందం ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొని సాధ్యమైనంత మేర గోదావరి జలాలను వినియోగించి సాగుకు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగునీటి వనరులను సద్వినియోగం చేసుకుని రైతుల పంటల సాగుకు భరోసా కల్పించేందుకు మంత్రులు ప్రాజెక్టుల బాటపట్టారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో ములుగు జిల్లాలోని దేవాదుల ప్రాజెక్టును అమాత్యుల బృందం సందర్శించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జలవనరుల శాఖ ఉన్నతాధికారుల బృందాన్ని వెంటబెట్టుకుని తొలుత కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క బ్యారేజీని ఆ తర్వాత దేవాదుల ప్రాజెక్టును సందర్శించారు. దేవాదుల పంప్ హౌస్‌ను పరిశీలించి ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం, - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఈ20' రచ్చ...!

వాహనదారులనుంచి ఈ20 పెట్రోల్ వాడకంపై అభ్యంతరాలు, విమర్శలు తీవ్రమవుతున్న నేపథ్యంలో, కేంద్ర పెట్రోలియం మంత్రిత్వశాఖ ఒక సుదీర్ఘ వివరణ విడుదల చేసింది. 20శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకం వల్ల ఎన్నెన్ని ప్రయోజనాలు ఉన్నాయో తెలియచెప్పడం ఈ డాక్యుమెంట్ లక్ష్యం. సామాన్యులతో పాటు, కొందరు విపక్షనేతలు కూడా ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్‌మీద విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. 2023కంటే ముందు తయారైన వాహనాల్లో ఈ ఇంధనాన్ని వినియోగించడంలో ఉన్న కష్టనష్టాలను వివరించండి అంటూ ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ 29వాహన తయారీ కంపెనీలకు ఇటీవలే లేఖ రాసి, వారంలోగా ప్రజలకు వివరణ ఇవ్వాలని హెచ్చరించారు కూడా. వారంక్రితం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఓ మీడియా సమావేశంలో, మూడు దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీల ప్రతినిధులు ఈ20ని మెచ్చుకుంటూ, ఈ ఇంధనంతో ఇంజన్లకు కీడు జరగదని, మైలేజీ మాత్రం మూడు నుంచి ఐదుశాతం తగ్గవచ్చునని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ సమావేశాల్లో ఆయా కంపెనీల ప్రతినిధులు ఇలా చెబుతూంటే, అవి వాహనయజమానులకు ఇచ్చే మాన్యువల్స్‌లో మాత్రం పదిశాతం కంటే ఎక్కువ ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకూడదని ఎందుకు హెచ్చరించాయని కేజ్రీవాల్ ప్రశ్న. సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన రచ్చ జరుగుతున్న తరుణంలో ప్రభుత్వం ఈ వివరణ ద్వారా ప్రజాందోళనని చల్లార్చే ప్రయత్నం చేసింది. ధరకాస్తంత ఎక్కువైనా, మైలేజీ ఓ మోస్తరుగా తగ్గినా, ఈ చమురు వల్ల పర్యావరణానికి చాలా మేలు జరుగుతుందని, సాధారణ పెట్రోల్ ధరలకు ఆటుపోట్లు ఉన్నా, దీనికి మాత్రం ఉండదని, వాహన జీవితకాలం కూడా హెచ్చుతుందని, పాతవాహనాలు పాడవుతాయన్న వాదన శుద్ధ అబద్ధమనీ, ఇథనాల్ బ్లెండింగ్ వల్ల దాదాపు రెండులక్షలకోట్ల విదేశీమారకద్రవ్యం ఆదా చేశామని ప్రభుత్వం ఈ డాక్యుమెంట్‌లో చాలా చెప్పింది. ఈ20తో దెబ్బతిన్న ఒక్క కారునైనా చూపించండి అంటూ కేంద్ర రోడ్డు రవాణామంత్రి నితిన్ గడ్కరీ కూడా సవాలు చేస్తున్నారు. కొన్ని పాతమోడల్ వాహనాల్లోని భాగాలపై స్వల్పస్థాయి ప్రభావం ఉంటుందని గ్రహించినందువల్లనే, సర్వీసింగ్ సమయంలో ఆయా భాగాలను రిప్లేస్ చేయమని తాము వాహనసంస్థలను కోరినట్టు కూడా ఆయన చెప్పుకొచ్చారు. ఈ20తో పదిశాతం మైలేజీ తగ్గిందనీ, వాహనాన్ని ఎక్కువసార్లు రిపేర్లు చేయించవలసి వస్తోందని అత్యధికులు చెప్పినట్లు ఇటీవలి సర్వేలు పేర్కొన్నాయి. ఇటీవలే ఢిల్లీలో ఇథనాల్ ఇంధనానికి వ్యతిరేకంగా నిరసనలు కూడా జరిగాయి. ఫ్యూయల్ పైపులు తుప్పుబట్టడం, ఇంజక్టర్లు మూసుకుపోవడం వంటివి జరుగుతున్నట్లుగా ఒకపక్క జనం చెబుతూ, ఐదుశాతం మైలేజీ తగ్గుతుందని ప్రభుత్వమూ, కంపెనీలూ మరోపక్క అంటున్న తరుణంలో, ఈ20వల్ల అంతిమంగా ఒనగూరే లబ్ధిని నిక్కచ్చిగా లెక్కవేయాల్సిందే. తక్కువ మైలేజీ కారణంగా అధికపెట్రోల్‌ను వినియోగించాల్సి రావడం, రిపేర్లకు ఎక్కువ ఖర్చుచేయాల్సి ఉండటం సామాన్యుడికీ, పర్యావరణానికీ మేలు చేయబోదు. దీనికితోడు, ఇథనాల్ కంపెనీలకు బ్యాంకులు విరివిగా లక్షలకోట్లు అప్పులిచ్చి, భారీ ఎత్తున ఉత్పత్తి చేపట్టామని ప్రభుత్వమే చెప్పుకొచ్చింది. ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్న ఇథనాల్ ప్లాంట్లకు వ్యతిరేకంగా పలుచోట్ల ఉద్యమాలు జరుగుతున్నాయి. వాటి కాలుష్యంతో పంటలకూ, ప్రజలకు, పాడిపశువులకు జరుగుతున్న నష్టం అపారమైనదని, కేవలం ఇథనాల్ ఉత్పత్తికోసం వరి, మొక్కజొన్న, సోయాబీన్ పంటలను అత్యధికంగా సాగుచేయడంద్వారా భూగర్భజలాలు క్షీణిస్తున్నాయని శాస్త్రవేత్తల ఆవేదన. కేంద్రప్రభుత్వం ఈ ప్లాంట్లకోసం మరింత చవుకగా బియ్యాన్ని సరఫరా చేస్తున్నది. ఇది చాలదన్నట్టుగా అమెరికానుంచి జన్యుమార్పిడి మొక్కజొన్న దిగుమతులకు అనుమతించండంటూ ప్లాంట్ల యజమానులు ప్రభుత్వాన్ని పోరుతున్నారు. ఇథనాల్ కలిపిన పెట్రోల్ కారుచవుకగా లభిస్తుందని గడ్కరీ గతంలో చేసిన వ్యాఖ్యలు సైతం నిరాధారమైనవని తేలిపోయింది. సామాన్యుడికీ, రైతుకూ, పర్యావరణానికీ మేలు చేయనిపక్షంలో ఇథనాల్ ఇంధనంమీద ప్రజావ్యతిరేకత ఎదుర్కోక తప్పదు. విమర్శలు, ప్రతివిమర్శలతో సరిపుచ్చడం కాక, ఆయా రంగాల ప్రముఖులు, నిపుణులతో స్వతంత్రకమిటీలను ఏర్పాటుచేసి ఇథనాల్ ఇంధనం ప్రయోజనాలను, ప్రభావాలను నిగ్గుతేల్చడం అవసరం.

# ధవళేశ్వరం బ్యారేజీకి 117 కొత్త గేట్లు



మొదటిపేజీ తరువాయి - శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో సీఎం మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెల నాటికి కొత్త గేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాల నాటికి సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ "గోదావరి డెల్టా దేశానికే అన్నపూర్ణగా మారిందంటే కాటన్ చొరవే. బ్రిటీష్ వాళ్లు వెళ్లిపోయినా, కాటన్ దొర విగ్రహాలు పెట్టి గౌరవించుకుంటున్నాం. నాడు బ్యారేజీ నూతన నిర్మాణానికి మిత్ర కమిటీ సిఫారసు చేసింది. 1970 నుంచి 1980 వరకు నూతన బ్యారేజ్ నిర్మించారు. నాడు నూతన బ్యారేజ్‌ను ఎన్టీఆర్ ప్రారంభించారు. 10 లక్షల 13 వేల ఎకరాలకు సాగునీరు అందించిన పరిస్థితి. 32 లక్షల క్యూసెక్కుల వరద తట్టుకునేలా నిర్మాణం జరిగింది. 50 ఏళ్లు అయ్యాక గేట్లు, మోటార్లు, ఎలక్ట్రిక్ వ్యవస్థ దెబ్బతింది. 2014లో రూ.32 కోట్లతో 194 గేట్లలో 64 గేట్ల మరమ్మతులు చేశాం. తర్వాత వచ్చిన ప్రభుత్వం గేట్లు మార్చడం కాదు, కొట్టుకుపోయినా పట్టించుకోలేదు. పోలవరాన్ని ఏపీ జీవనాడిగా భావించి 72 శాతం పనులు పూర్తి చేశాం. ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021కి పోలవరం పూర్తయ్యేది. పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు గోదావరి జలాలు తీసుకెళ్లాం. కృష్ణా డెల్టా నుంచి శ్రీశైలంలో నిల్వ చేసి రాయలసీమకు ఇచ్చాం. ఒక్క నిర్ణయంతో రాయలసీమ దశ, దిశ మారిపోయింది, కియా మోటార్స్ వచ్చింది. దయా ఫ్రం వాల్‌ను కాపాడలేక గోదావరి పాల్జేశారు. వచ్చే మార్చిలోపు పనులు పూర్తిచేసి ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తాం. రెండేళ్లలో సాగునీటి కోసం రూ.24 వేల కోట్లు ఖర్చుపెట్టాం. తుంగభద్ర గేట్లు కొట్టుకుపోతే మరమ్మతులు చేశాం. గోదావరి పుష్కరాలు అత్యంత వైభవంగా నిర్వహించే బాధ్యత మాది" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# అమరావతి క్వాంటమ్ వ్యాలీ వైపు అందరి చూపు

మొదటిపేజీ తరువాయి -
పంపే సందేశాలు ఆర్ఎస్ఏ 2048, ఏఈఎస్ వంటి బలమైన మేథమెటికల్ మోడల్స్ ఎన్‌క్రిప్ట్ అవడం వల్ల సురక్షితంగా ఉన్నాయి. వీటిని సంప్రదాయ కంప్యూటర్లతో బ్రేక్ చేయాలంటే కనీసం పది వేల ఏళ్లు పడుతుంది. కానీ శక్తిమంతమైన క్వాంటమ్ కంప్యూటర్లు అందుబాటులోకి వస్తే ఈ అల్గారిథమ్స్‌ను క్షణాల మీద బ్రేక్ చేసి సమాచారాన్ని డీకోడ్ చెయొచ్చు. వ్యక్తిగత వివరాల నుంచి జాతీయ భద్రత, బ్యాంకింగ్, రైల్వేలు, పోర్టులు, టెలికాం లాంటి అత్యంత కీలకమైన రంగాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. హ్యాకర్లు, శత్రుదేశాలు ఇప్పుడే డేటాను దొంగిలించి దాస్తూ క్వాంటమ్ టెక్నాలజీ రాగానే డీకోడ్ చేయాలనే 'హార్వెస్ట్ నౌ, డిక్రిప్ట్ లేటర్ వ్యూహంతో ముందుకు వెళ్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. క్వాంటమ్ కంప్యూటర్లు సైతం బ్రేక్ చేయలేని సరికొత్త అల్గారిథమ్స్‌ను రూపొందించి సమాచారాన్ని ఎన్‌క్రిప్ట్ చేయడమే దీనికి ఏకైక పరిష్కారం. దాన్నే పోస్ట్ క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ (పీక్యూసీ) అంటారు. అయితే కొత్త అల్గారిథమ్స్ తయారు చేయడం, వాటికి మైగ్రేట్ అవ్వడం అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ. దీనికోసం క్వాంటమ్ రంగంలో అపార నైపుణ్యమున్న మానవ వనరులు అవసరం. మన దేశంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆర్‌బీఐ వంటి సంస్థలు నిపుణుల కమిటీలను వేసి మార్గదర్శకాలను సిద్ధం చేస్తున్నాయి. త్వరలోనే మైగ్రేషన్ గడువుపై స్పష్టత రానుంది. రాబోయే సంక్షోభాన్ని ఒక అవకాశంగా మార్చుకుంటూ క్వాంటమ్ వ్యాలీని గ్లోబల్ పీక్యూసీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ నెల 24న ప్రతిష్ఠాత్మక బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్‌తో పాటు మరో మూడు ప్రముఖ బ్యాంకులు అమరావతి క్వాంటమ్ వ్యాలీ (ఏక్యూవీ)తో చారిత్రాత్మక ఎంఓయూలు కుదుర్చుకోబోతున్నాయి. ఈ బ్యాంకులు తమ వందలాది సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లను సరికొత్త ఎన్‌క్రిప్షన్ ప్రొటోకాల్స్‌లోకి మార్చేందుకు వీలుగా అమరావతిలో తమ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లను ఏర్పాటు చేయనున్నాయి. ఇక్కడి స్టార్టప్‌లతో కలిసి అవి పని చేస్తాయి. అలాగే పీక్యూసీ ఎకోసిస్టమ్ ఏర్పాటును పరిశీలించేందుకు నేషనల్ టెక్నాలజీ రీసెర్చ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు వచ్చే వారమే అమరావతికి వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సేవలందించేందుకు రూపొందించిన 'అవేర్'యాప్‌తో పాటు 'లేపాక్షి' యాప్‌ను ప్రయోగాత్మకంగా పీక్యూసీ మెథడాలజీలోకి మార్చి, ఏక్యూవీ పైలట్ ప్రాజెక్టులను విజయవంతంగా ప్రదర్శించింది.

# రామాలయం విరాళాల చోరీపై నివేదిక సమర్పించండి

మొదటిపేజీ తరువాయి - యంత్రాంగాలను ఏర్పాటు చేసే విధంగా కేంద్రం, యూపీ ప్రభుత్వం, ట్రస్ట్‌కు ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో వివరించారు. ఎఫ్ఐఆర్ లేదా సాధారణ క్రిమినల్ కేసు కూడా నమోదు చేయకుండానే సిట్ ఈ వ్యవహారంపై విచారణ ప్రారంభించిందని పిటిషనర్లు ఆక్షేపించారు. ట్రస్ట్‌కు సంబంధించి నిధుల దుర్వినియోగం, ఇతర అవకతవకలకు సంబంధించిన నివేదికలు చివరికి నిజమని తేలినా, తేలకపోయినా, అవన్నీ అయోధ్య పూర్వ వైభవాన్ని పునరుద్ధరణకు పోరాడిన తరాల్లో తీవ్ర ఆందోళనను కలిగించాయన్నారు. ఇందులో ఉన్న అంశాలు కేవలం 'కాగ్నిజబుల్' (పోలీసులు స్వయంగా కేసు నమోదు చేసే) నేరాలకు సంబంధించినవి మాత్రమే కాదని, అసంఖ్యాక భక్తులు, ప్రజల విశ్వాసం, మనోభావాలు, నమ్మకాలపై కూడా ప్రత్యక్ష ప్రభావం చూపుతాయని తెలిపారు. శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఏర్పడిన నాటి నుంచి స్వీకరించిన అన్ని విరాళాలు, కానుకల పూర్తి వివరాలను అందించేలా సుప్రీం కోర్టు ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఈ వివరాల్లో నగదు విరాళాలు, బ్యాంకు బదిలీలు, డిజిటల్ చెల్లింపులు, విదేశీ విరాళాలు, వస్తు రూపంలో విరాళాలు, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులతో పాటు, వాటి అకౌంటింగ్, సంరక్షణ, వినియోగానికి సంబంధించిన వివరాలు కూడా చేర్చాలని తెలిపారు. ఈ సందర్భంగా కేసు విచారణలో భాగంగా ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్ట్‌ను సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని కోర్టుకు వివరించారు. అయితే, ఆ నివేదిక ప్రతిని తమకు కూడా ఇవ్వాలని పిటిషనర్లు కోరగా, ఆ అభ్యర్థనకు వ్యతిరేకంగా మెహతా వాదించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ, "మీకు చట్టం తెలుసు. ఎలాగైనా వారు ఆ రిపోర్ట్‌ను చూస్తారు" అని స్పష్టం చేసింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు జారీ చేసిన నోటీసులను మెహతా స్వీకరించారు. దీంతో ఈ కేసు తదుపరి విచారణను సుప్రీం కోర్టు ఈ నెల 20కు వాయిదా వేసింది. రామాలయంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో గత 13న ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే దర్యాప్తు చేపట్టగా పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. లెక్కింపు సమయంలో పర్యవేక్షణ లోపాలను సిట్ గుర్తించింది. అనంతరం పలు అరెస్టులు చోటుచేసుకోవడంతో శ్రీరామ జన్మభూమి ట్రస్టు ప్రధాన కార్యదర్శి పదవికి చంపత్ రాయ్ రాజీనామా చేశారు. అయితే, తనపై వస్తోన్న ఆరోపణలు నిరాధారమని ఆయన పేర్కొన్నారు.

# పెళ్లి పేరుతో భారత మహిళలకు వల

మొదటిపేజీ తరువాయి - జైషే చీఫ్ మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నేతృత్వంలో గతేడాది అక్టోబర్‌లో ఏర్పాటైన 'జమాత్-ఉల్-మోమినాత్' (జేయుఎం) అనే మహిళా విభాగం ఈ కుట్రకు కేంద్రంగా పనిచేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఐబీ అధికారుల కథనం ప్రకారం.. ఈ ఉగ్రముఠాలోని యువకులు భారతీయ మహిళలతో సోషల్ మీడియా ద్వారా పరిచయం పెంచుకుంటున్నారు. ముఖ్యంగా పాకిస్థాన్ సరిహద్దులకు సమీపంలో నివసించే మహిళలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. సుమారు ఆరు నెలల పాటు వారితో ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ, ప్రేమ నటిస్తూ నమ్మకం పెంచుతారు. తాము నిజమైన ప్రేమలో ఉన్నామని, పెళ్లి చేసుకుని మంచి జీవితం ఇస్తామని నమ్మిస్తారు. ఈ సమయంలో గూఢచర్యానికి సంబంధించిన సున్నితమైన ప్రశ్నలు ఏవీ అడగకుండా జాగ్రత్తపడతారు. పూర్తిగా వారిని నమ్మించి, పెళ్లికి ఒప్పించిన తర్వాత పాకిస్థాన్‌కు రప్పించేందుకు ప్రయత్నిస్తారు. పాకిస్థాన్‌కు చేరాక, వారిని ఉగ్రవాద భావజాలంతో నింపి, గూఢచారులుగా మార్చి తిరిగి భారత్‌కు పంపేందుకు ప్లాన్ చేస్తున్నారు. గతంలో ఇలాంటి కార్యకలాపాలు జమ్మూకశ్మీర్‌కే పరిమితం కాగా, ఇప్పుడు ఉగ్రవాదులు తమ దృష్టిని రాజస్థాన్‌పైకి మార్చారు. పాకిస్థాన్‌తో రాజస్థాన్‌కు 1,070 కిలోమీటర్ల పొడవైన సరిహద్దు ఉండటమే దీనికి ప్రధాన కారణం. శ్రీ గంగానగర్ నుంచి బార్మర్ వరకు విస్తరించిన ఈ సరిహద్దు ప్రాంతాల్లోని యువతుల సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను ఐఎస్ఐ మద్దతు ఉన్న ఉగ్రవాదులు నిశితంగా పరిశీలిస్తున్నారు. సామాజికంగా ఒంటరితనం అనుభవిస్తున్న, కుటుంబ సంబంధాలు సరిగా లేని, మానసికంగా బలహీనంగా ఉన్న యువతులే వీరి ప్రధాన లక్ష్యం. ఇలాంటి వారు ప్రేమ, ఆప్యాయతలకు సులభంగా ఆకర్షితులవుతారని ఉగ్రవాదులు భావిస్తున్నారు. యువతి పెళ్లికి అంగీకరించగానే, పాస్‌పోర్ట్ సిద్ధం చేసుకోమని చెబుతారు. రాజస్థాన్ సరిహద్దుల గుండా నేరుగా పాకిస్థాన్‌లోకి ప్రవేశించడం వీరి మొదటి ప్రాధాన్యత. అది సాధ్యం కాకపోతే, నేపాల్ మార్గం ద్వారా లేదా సౌదీ అరేబియా ద్వారా పాకిస్థాన్‌కు చేరవేసేందుకు ప్రత్యేక ఏజెంట్ల సహాయం తీసుకుంటున్నారు. ఈ మార్గాల్లో వీరిని పాకిస్థాన్‌కు చేర్చడానికి జైషేకు చెందిన ప్రత్యేక ఏజెంట్లు పనిచేస్తున్నారని నిఘా వర్గాలు తెలిపాయి. ఈ కుట్ర కేవలం గూఢచర్యం కోసమే కాదని, భారత్‌లో జైషే మహిళా విభాగం (జేయుఎం) నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించేందుకు కూడా ఈ పన్నాగం పన్నుతున్నారని అధికారులు హెచ్చరిస్తున్నారు. పాక్‌కు చేరిన మహిళల ద్వారా భారత్‌లోని ఇతర యువతీయువకులను ఉగ్రవాదం వైపు ఆకర్షించేలా చేయడం కూడా వారి దీర్ఘకాలిక లక్ష్యమని స్పష్టం చేశారు.

# ప్రపంచ నేతలే లక్ష్యంగా ఇరాన్ హిట్‌లిస్ట్

మొదటిపేజీ తరువాయి - ఇరాన్‌లో ఓ ప్రముఖ వార్తాపత్రిక ప్రచురించిన కథనం అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఇరాన్ దివంగత మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ దేశాల అధినేతలే లక్ష్యంగా ఒక 'హిట్‌లిస్ట్'ను ఆ పత్రిక విడుదల చేసింది. రాజధాని టెహ్రాన్ అధికార వర్గాల ఆధ్వర్యంలో నడిచే 'హమ్‌షహ్రీ' అనే వార్తాపత్రిక 13 మంది విదేశీ నేతల ఫొటోలతో కూడిన ఒక ఇన్ఫోగ్రాఫిక్‌ను నిన్న రాత్రి ఆన్‌లైన్‌లో ప్రచురించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఫిబ్రవరి 28న మధ్యప్రాచ్య యుద్ధం మొదటి రోజున అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఆయన తర్వాత సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన కుమారుడు మొజ్తబా ఖమేనీ ప్రతీకార ప్రతిజ్ఞ చేశారు. "ప్రతీకారం తీర్చుకోవడం మా జాతి సంకల్పం. అది కచ్చితంగా నెరవేరుతుంది. జాబితాలో పేర్లున్న ఈ నేరస్థులు.. మంచం మీదే ప్రశాంతంగా చనిపోవాలన్న కోరికను తమతో పాటే సమాధిలోకి తీసుకువెళతారు" అని తన తండ్రి అంత్యక్రియల తర్వాత మొజ్తబా హెచ్చరించారు. అయితే, ఆయన తన సందేశంలో ఎవరి పేర్లనూ బయటపె ట్టలేదు. 'హమ్‌షహ్రీ' పత్రిక విడుదల చేసిన జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, బ్రిటన్ ఆపద్ధర్మ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌ల పేర్లు ఉన్నాయి. వీరితో పాటు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ కూడా ఈ జాబితాలో ఉన్నారు. అయితే, పత్రిక ప్రింట్ ఎడిషన్‌లో ఈ జాబితా కనిపించకపోవడం గమనార్హం. ఇది కేవలం పత్రిక ప్రచురించిన జాబితానే తప్ప, ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది కాదని తెలుస్తోంది. యుద్ధ సమయంలో తమ భూభాగంపై జరిగిన దాడులను ఖండించడంలో యూరప్ దేశాలు విఫలమయ్యాయని, అమెరికా సైనిక విమానాలకు తమ గగనతలాన్ని ఉపయోగించుకునేందుకు అనుమతినిచ్చి ఆ నేరంలో పాలుపంచుకున్నాయని ఇరాన్ ఆరోపిస్తోంది. ఇదిలా ఉండగా, యుద్ధానికి ముందు నుంచే కనిపించకుండా పోయిన మొజ్తబా ఖమేనీ.. తన తండ్రిపై జరిగిన దాడుల్లో గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి.

## పోలవరం ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించిన సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి - ముఖ్యంగా ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం (ఈసీఆర్ఎఫ్)లోని గ్యాప్ 1, గ్యాప్ 2 పనులతో పాటు, నిర్మాణంలో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని కూడా ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, పనుల వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఆయన వెంట జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఉన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

## తెలంగాణలో మళ్లీ ఎండాకాలం!

మొదటిపేజీ తరువాయి - భద్రాచలం జిల్లాల్లో 37 డిగ్రీలు నమోదు కాగా మెదక్‌లో సాధారణ స్థాయి నుంచి 4.6 డిగ్రీలు అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారి తెలిపారు. రాగల 5,6 రోజుల పాటు తెలంగాణలో వర్షాలు కురవకపోగా ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం నమోదవుతున్న గరిష్ట ఉష్ణోగ్రతలు మరో ఒకటి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. రాగల 5,6 రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని, ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 30 శాతంపైగా లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జులై 2వ వారంలో మంచిగా వర్షాలు పడే సమయమని, కానీ వానలు కురవకపోయిన క్లౌడింగ్ ఉందని, ఈ సమయంలో 30 నుంచి 32 డిగ్రీల ఉష్ణగ్రత ఉండే అవకాశం ఉంటుందని శ్రీనివాస్ రావు తెలిపారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో మొదట వారంలో ఈదురుగాలులు వీచాయని, ప్రస్తుతం తగ్గుముఖం పట్టాయని, క్లౌడినెస్ కూడా లేదని చెప్పారు. దీంతో గత నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయని, 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుందని, ప్రస్తుతానికి హెచ్చరికల స్థాయికి ఉష్ణోగ్రతలు పెరగలేదని వెల్లడించారు. వర్షాలు కురవకపోవడానికి ఎల్‌నినో ప్రభావం అని కూడా చెప్పవచ్చని, కొన్ని ప్రదేశాల్లో వర్షాలు విపరీతంగా కురిశాయని, కొన్ని చోట్ల వానలు పడలేదని, ఈ లక్షణాలు ఎల్‌నినోకే ఉంటాయని పేర్కొన్నారు.

## 'సింగరేణి భరోసా యాత్ర' ప్రారంభించిన తెలంగాణ బీజేపీ



మొదటిపేజీ తరువాయి - పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తదితర నేతలు ఈ రెండు రోజుల యాత్రకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఖమ్మం జిల్లాకు చేరుకున్న వారికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ యాత్రలో భాగంగా నాలుగు జిల్లాల్లోని సింగరేణి గనుల కార్మికులను కలిసి, సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించనున్నట్లు బీజేపీ నేతలు తెలిపారు. తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపు వల్ల సింగరేణి దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి బలం చేకూరుతుందని, దీంతో కార్మికుల్లో విశ్వాసం పెరిగిందని రాంచందర్ రావు పేర్కొన్నారు. యాత్ర ప్రారంభానికి ముందు మాట్లాడిన రాంచందర్ రావు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ సింగరేణిని నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. ఈ కారణంగానే ప్రభుత్వ రంగ సంస్థ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని అన్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రం సింగరేణిని బలోపేతం చేయడానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం చరిత్రాత్మక నిర్ణయమని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బొగ్గు బ్లాక్‌లు వేలం ద్వారా కేటాయించాల్సి ఉన్నప్పటికీ, చట్టపరమైన అవకాశాలను పరిశీలించి, న్యాయ సలహా తీసుకున్న అనంతరం మోదీ ప్రత్యేకంగా ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ట్రేడ్ యూనియన్ల విజ్ఞప్తి మేరకు తాను ప్రధానితో చర్చించి ఈ కేటాయింపును సాధించామని చెప్పారు.

## షాబాద్‌లో ఆరు హత్యల కేసు నిందితుడు రాజ్‌కుమార్ మృతి

మొదటిపేజీ తరువాయి - తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన రంగారెడ్డి జిల్లా షాబాద్ ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు బి. రాజ్ కుమార్ (35) సోమవారం శవమై తేలిన సంగతి తెలిసిందే. కొత్తూరు మండలం, పెంజర్ల గ్రామ శివార్లలోని ఓ వెంచర్ వద్ద అతని మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. మృతదేహం వద్ద విషం బాటిల్ లభ్యం కావడంతో, అతను ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనతో ఈ కేసు విషాదాంతంగా ముగిసింది. ఈ కేసు దర్యాప్తులో పోలీసులకు అత్యంత కీలకమైన ఆధారం లభించింది. రాజ్ కుమార్ మృతదేహం వద్ద స్వాధీనం చేసుకున్న అతని మొబైల్ ఫోన్‌లో ఒక సెల్ఫీ వీడియోను గుర్తించారు. హత్యలకు పాల్పడటానికి ఒకరోజు ముందు, అంటే జులై 10వ తేదీ సాయంత్రం 4:55 గంటలకు ఈ వీడియోను రికార్డ్ చేసినట్లు తేలింది. తాను నమ్మిన వాళ్లే తనను మోసం చేశారని, ముఖ్యంగా పోక్సో కేసుకు కారణమైన అమ్మాయి కుటుంబం తనను ఆర్థికంగా నిండా ముంచిందని వీడియోలో రాజ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశాడు. వారు తనను ఆర్థికంగా వాడుకున్నారని ఆరోపించాడు. తన సంపాదనలో సగం వారికే ఇచ్చానని, వారి వల్ల అప్పుల పాలై ఆస్తులు కోల్పోయానని, తన పిల్లల భవిష్యత్తు నాశనమైందని వాపోయాడు. తనపై తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపారని, ఈ ద్రోహానికి ప్రతీకారంగానే ఈ హత్యలకు పాల్పడుతున్నానని పేర్కొన్నాడు. పోక్సో కేసులో ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చిన రాజ్ కుమార్, జులై 10న అర్ధరాత్రి దారుణానికి ఒడిగట్టిన విషయం తెలిసిందే. తనపై పోక్సో కేసు పెట్టిన 17 ఏళ్ల బాలిక, ఆమె తల్లి, నాయనమ్మతో పాటు తన సొంత భార్య, ఇద్దరు కుమారులను కూడా కత్తితో పొడిచి కిరాతకంగా హత్య చేశాడు. షాబాద్ మండలంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తర్వాత పరారీలో ఉన్న రాజ్ కుమార్ కోసం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ఆధ్వర్యంలో పలు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పోలీసులు భారీ గాలింపు చర్యలు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్, జీపీఎస్ సిగ్నల్ల ఆధారంగా అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. మరోవైపు, ఈ కేసులో నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణలపై ఓ సబ్-ఇన్‌స్పెక్టర్‌తో పాటు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను కూడా ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ప్రస్తుతం రాజ్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అతని మృతిపై కూడా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్యలకు ముందు రికార్డ్ చేసిన సెల్ఫీ వీడియోను ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం పంపినట్లు అధికారులు తెలిపారు. ఈ వీడియో ఈ కేసులో నిందితుడి మానసిక స్థితిని, నేరానికి దారితీసిన కారణాలను స్పష్టం చేసే కీలక సాక్ష్యంగా మారనుంది.

## కన్నెపల్లి నుంచి ఎల్లంపల్లికి నీరు తరలించే అవకాశం లేదు



మొదటిపేజీ తరువాయి - గోదావరి వస్తున్న ప్రవాహం, ఎత్తిపోస్తున్న జలాల సామర్థ్యం వివరాలు అధికారులను మంత్రులు అడిగి తెలుసుకున్నారు. దేవాదుల ప్రాజెక్టు పనులపై అధికారులతో సమీక్షించి మొత్తం 22 రిజర్వాయర్లు నింపేలా గోదావరి జలాలు తరలించాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. వీలైనంత త్వరగా దేవాదుల ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొని సాధ్యమైనంత మేర ఆయకట్టుకు నీరందేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. కాళేశ్వరం విషయంలో బీఆర్ఎస్ అసత్యాలు ప్రచారం చేస్తోందని ఆక్షేపించారు. దేవాదుల ద్వారా 12 జిల్లాలకు సాగు నీరు అందిస్తామని భట్టి భరోసా ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్‌డీఎస్ఏ టెస్టింగ్ ప్రాసెస్ దాదాపు పూర్తి కావచ్చిందన్న మంత్రి మూడు బ్యారేజీలకు మరమ్మతులు చేసి పునరుద్ధరించేందుకు ఐఐటీ బాంబే సంస్థల ద్వారా రీ డిజైన్ చేస్తున్నామన్నారు. వచ్చే వేసవి కాలం నాటికి పనులు పూర్తి చేసి బ్యారేజీలను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. సాంకేతికంగా కన్నెపల్లి బ్యారేజీ నుంచి నేరుగా ఎల్లంపల్లికి నీళ్లు తీసుకెళ్లే అవకాశమే లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టుల పేరు మార్చి వేల కోట్ల ప్రతిపదనలు పెంచి బీఆర్ఎస్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనుల పూర్తి కోసం తక్షణం రూ.146 కోట్లు విడుదల చేస్తామని మంత్రులు వెల్లడించారు.

# అంగన్వాడీలను అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నాం

**చిన్నారులు, గర్భిణి స్త్రీలు, బాలింత మహిళలకు**

**నాణ్యమైన పౌష్టికాహారం, మెరుగైన సేవలు**

**మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి**

**కొండపి ఐసిడిఎస్ పరిధిలో అంగన్వాడీ కేంద్రాలకు**

**ఎలక్ట్రికల్ స్టవ్ లు పంపిణీ చేసిన మంత్రి డా.స్వామి**



**ఒంగోలుజులై 13 .అక్షర టైమ్స్ :** కూటమి ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. సోమవారం తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో కొండపి ఐసిడిఎస్ పరిధిలో అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం మంజూరు చేసిన 381 ఎలక్ట్రికల్ స్టవ్ లు మంత్రి డా. స్వామి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ.... అంగన్వాడీ కేంద్రాలలో మహిళలు, పిల్లలకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందించ డంతో పాటు వాటికి స్వంత భవనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి సంబంధించిన అనేక సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఎంతో చొరవ చూపుతోంది. గత ప్రభుత్వంలో అంగన్వాడీ సెంటర్లు అత్యంత దయనీయ స్థితిలో ఉండేవి. సకాలంలో టీచర్లకు జీతాలు చెల్లించే వారు కాదు, టీచర్లు నానా ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వంలో అంగన్వాడీ సెంటర్లలో టెలివిజన్, ఆర్వో వాటర్, ఆట వస్తువులు, చార్టులు ఇండక్షన్ స్టవ్, నాణ్యమైన వంట పాత్రలు ఇలా అన్ని వసతులు కల్పించినట్లు చెప్పారు. మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్లుగా ప్రమోషన్ ఇచ్చింది కూటమి ప్రభుత్వమని తెలిపారు. అంగన్వాడీ టీచర్ల తొమ్మిది డిమాండ్లలో చాలా వరకూ నెరవేర్చామన్నారు. క్రమంగా ప్రతీనెలా ఒకటవ తేదీన జీతాలు చెల్లిస్తున్నామని తెలిపా రు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం రెండు సార్లు జీతాలు పెంచిందని గుర్తుచేశారు. అంగన్వాడీ సెంటర్లలో తాగునీరు మరుగుదొడ్లకు రూ.86.68 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. గతంలో కేవలం అరకొర జీతాలు ఉండగా కూటమి ప్రభుత్వం టీచర్ల జీతాలు పెంచి అంగన్వాడీ టీచర్ల ఆర్థిక, సంక్షేమాభివృద్ధికి తోడ్పడిన ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని స్పష్టం చేశారు. సుమారు రూ.75 కోట్లతో 5జీ మొబైల్స్ కొనుగోలు చేసి 58,204 మంది టీచర్లకు అందించామని, సెంటర్లలో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వ సేవలు వేగంగా అందుతున్నాయని మంత్రి వివరించారు.

# ఎల్ నిన్యో ముప్పును తిప్పికొట్టే అస్త్రం 'ప్రకృతి వ్యవసాయం'

**రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచన**

**గోకవరంలో ఎల్ నిన్యో దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన**



**గోకవరంజులై 13 .అక్షర టైమ్స్ :** అస్థిరమైన వాతావరణ పరిస్థితులు, ముంచుకొస్తున్న 'ఎల్ నిన్యో' దుష్ప్రభావాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రకృతి సేద్యమే ఏకైక మార్గమని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్పష్టం చేశారు. ఎల్ నిన్యో ముప్పు నుంచి పంటలను ఎలా కాపాడుకోవాలనే అంశంపై తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మండల పరిధిలోని 7 క్లస్టర్లు, 14 గ్రామ పంచాయతీల్లో పర్యటించిన సిబ్బంది, రైతులకు కరపత్రాలు పంపిణీ చేసి చైతన్యపరిచారు. ఈ సందర్భంగా మండల ఇంచార్జ్ లగుడు దేవి మాట్లాడుతూ.. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల ఎల్ నిన్యో ఏర్పడుతుందని, దీనివల్ల రానున్న రోజుల్లో తీవ్రమైన ఎండలు, వర్షాభావ పరిస్థితులు దాపురిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా నేలలో తేమశాతం పడిపోయి, భూగర్భ జలాలు అడుగంటుతాయని పేర్కొన్నారు. వరి, మొక్కజొన్న, అపరాల వంటి ప్రధాన పంటల దిగుబడి గణనీయంగా తగ్గడంతో పాటు చీడపీడల ఉధృతి అధికమయ్యే ప్రమాదం ఉందన్నారు.

**ప్రకృతి సేద్యంతోనే రక్షణ:**

ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రైతు సాధికార సంస్థ ప్రోత్సహిస్తున్న 'ప్రకృతి వ్యవసాయం' రైతుల పాలిట వరంలా మారుతుందని ఆమె వివరించారు. రైతులు పీఎండీఎస్ ఏటీఎం , ఆరుతడి పంటల పద్ధతులను అవలంబించడం ద్వారా కూరగాయలు, పశుగ్రాసంతో పాటు బహుళ పంటల సాగు వైపు మొగ్గుచూపాలని సూచించారు. వాతావరణ మార్పులను సైతం తట్టుకుని నిలబడే దేశీ విత్తనాలనే వినియోగించాలని, పొలాల్లో కంపోస్ట్ బ్యాంకులను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా రసాయన ఎరువులకు స్వస్తి పలికి జీవామృతం, కషాయాలు వంటి ఎస్2ఎస్ (ఎస్ 2ఎస్ ) విధానాలు పాటించడం ద్వారా.. తక్కువ పెట్టుబడితో భూమాతను కాపాడుకుంటూనే మెరుగైన దిగుబడులు సాధించవచ్చని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎంటీలు (ఎఫ్ ఎమ్ టీ ఎస్ ) గొల్లపల్లి కృష్ణ, కారం మంగారత్నం, ఐసీఆర్పీలు (ఐ సి అర్ పి ఎస్ ) జాజుల సూర్యకుమారి, తుర్రం బాపనమ్మ, కారం శివకుమారి, ప్రసాద్ తదితర ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు స్థానిక రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి - మున్సిపల్ కమిషనర్‌ను కోరిన మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి



ఐలాపూర్ తండా వద్ద అక్రమ కట్టడాలు..

**అమీన్‌పూర్,జులై 13 .అక్షర టైమ్స్ :** -ప్రతినిధి ఎం.వీరేష్ లింగంపల్లి నుంచి అమీన్‌పూర్ మీదుగా సుల్తాన్‌పూర్ రింగ్ రోడ్డు వరకు రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని, ఈ మార్గంలోని రేడియల్ రోడ్డు పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే అడ్డుకోవాలని కోరుతూ మాజీ పురపాలక చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పురపాలక కమిషనర్ సృజనకు వినతిపత్రం అందజేశారు. పాండురంగారెడ్డి నాయకత్వంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు సోమవారం కమిషనర్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. బీరంగూడ కమాన్ నుంచి కృష్ణారెడ్డిపేట మీదుగా సుల్తాన్‌పూర్ వెళ్లే మార్గంలో ప్రయాణికులు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. లింగంపల్లి నుంచి బంధంకొమ్ము, అమీన్‌పూర్ మీదుగా ఐలాపూర్ తండా ద్వారా సుల్తాన్‌పూర్ రింగ్ రోడ్డుకు అనుసంధానం చేస్తే వేలాది మందికి సమయం, ఇంధనం ఆదా అవుతుందని వివరించారు.

లింగంపల్లి నుంచి అమీన్‌పూర్ వరకు 150 అడుగుల రోడ్డు పనుల కోసం ప్రభుత్వం రూ. 45 కోట్ల నిధులను కేటాయించి పనులు ప్రారంభించింది. అయితే, మాస్టర్ ప్లాన్ రేడియల్ రోడ్డు నెంబర్ 31 (100 అడుగుల రోడ్డు) పరిధిలోని ఐలాపూర్ తండా వద్ద నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని నేతలు ఫిర్యాదు చేశారు. గతంలో ప్రభుత్వ, చెరువు భూముల రక్షణ కోసం అధికారులు ఏర్పాటు చేసిన కంచెను దాటి నిర్మాణదారులు అక్రమంగా పనులు చేస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అమీన్‌పూర్ చౌరస్తా నుంచి పీఎన్ఆర్ కాలనీ, ఐలాపూర్ తండా మీదుగా రింగ్ రోడ్డుకు కలిపితే కేవలం ఐదు నిమిషాల్లో ప్రయాణం సాధ్యమవుతుందని, కానీ ఈ అక్రమ కట్టడాల వల్ల భవిష్యత్తులో రవాణా వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉందని పాండురంగారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తు అవసరాలను గుర్తించి, అక్రమ నిర్మాణాలను నిలిపివేసి, మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ నివాసులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు

**పోలీసుల ఆరోగ్యమే ప్రజల భద్రతకు బలం**

**కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులకు ఉచిత వైద్య శిబిరం..**

**44 మంది సిబ్బందికి సమగ్ర ఆరోగ్య పరీక్షలు**







**కుషాయిగూడ,జులై 13 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** పగలు, రాత్రి అనే తేడా లేకుండా మండుటెండలు, వర్షాలు, కాలుష్యం, ట్రాఫిక్ రద్దీ మధ్య నిరంతరం విధులు నిర్వర్తిస్తూ ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడుతున్న పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యమనే ఉద్దేశంతో కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీసు సిబ్బంది సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి అధికారులు, సిబ్బంది విశేష స్పందన చూపారు.మల్కాజిగిరి పోలీసు కమిషనర్ బి. సుమంతి ఆదేశాల మేరకు, ట్రాఫిక్-2 ఉప్పల్--ఎల్బీనగర్ విభాగ ఉప పోలీసు కమిషనర్ వి. శ్రీనివాసులు మార్గదర్శకత్వంలో శ్రీకర ఆసుపత్రి మరియు రెటినోవా సేవా సంస్థ సంయుక్తంగా ఈ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించాయి. విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, తగిన వైద్య సేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో కంటి పరీక్షలు, దంత పరీక్షలు, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఫిజియోథెరపీ నిపుణులు వెన్నునొప్పి, మెడ నొప్పి, కీళ్ల సమస్యలు, ఎక్కువసేపు నిలబడి విధులు నిర్వహించడం వల్ల కలిగే శారీరక ఇబ్బందులను పరిశీలించి తగిన చికిత్సా సూచనలు అందించారు. ప్రతి పోలీసు సిబ్బందికి వ్యక్తిగతంగా ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసిన వైద్యులు అవసరమైన వారికి తదుపరి చికిత్సలు, మందుల వినియోగం, ఆహారపు అలవాట్లు, వ్యాయామం, ఒత్తిడి నియంత్రణ, జీవనశైలి మార్పులపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు చెందిన 44 మంది అధికారులు, సిబ్బంది పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. విధి నిర్వహణలో ఆరోగ్యవంతమైన పోలీసు బలగమే సమర్థవంతమైన సేవలకు మూలమని, ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలు సిబ్బందిలో ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు.శిబిరాన్ని స్టేషన్ హౌస్ అధికారి ఎన్. రామలక్ష్మణ రాజు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ జి. మల్లేష్, ఉప ఇన్‌స్పెక్టర్లు జి. మధు, ఎన్. భాస్కర్ పర్యవేక్షించి విజయవంతంగా నిర్వహించారు. పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వారు సూచించారు.ఈ సందర్భంగా ఆరోగ్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన శ్రీకర ఆసుపత్రి వైద్య బృందం, రెటినోవా సేవా సంస్థ ప్రతినిధులకు పోలీసు అధికారులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉచిత ఆరోగ్య శిబిరాలను తరచుగా నిర్వహించి పోలీసు సిబ్బంది ఆరోగ్య సంక్షేమానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని ఆకాంక్షించారు.

### జిఎస్.రావు మరణం

## తీరని లోటు అరిగెల అరుణకుమారి



**పెరవలి,జులై 13 .అక్షర టైమ్స్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ జి ఎస్ రావు మృతి తీరని లోటుఅని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిఅరిగెల అరుణకుమారి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా పెద్దేవం గ్రామస్తుడైన జి ఎస్ రావు కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలందించారు అన్నారు. దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి సమయంలో చాలా సన్నిహితముగా ఉన్న క్షణాలు ను గుర్తు చేశారు. వారి పాదయాత్రలో వారు చేసిన సేవలు మర్చిపోలేనివని కొనియాడారు. రాజకీయ వారసుడిగా ఆయనకుమారుడు జి శ్రీనివాస్ నాయుడు మరిన్ని పదవులు అధిరోహించాలన్నారు. ఆ భగవంతుడు ఆయన కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని అరిగెలా అరుణకుమారి నిండు మనసుతో ఆ భగవంతున్ని కోరుకున్నారు.

## మానవ సేవే మాధవ సేవ



**హైదరాబాద్,జులై 13 .అక్షర టైమ్స్ :** మానవ సేవే మాధవ సేవగా విద్యార్థినీ విద్యార్థులే దేశ భవిష్యత్తుగా పేద, బడుగు, బలహీన, దళిత, మైనార్టీ వర్గాలతో పాటు సమసమాజాభివృద్ధి లక్ష్యంగా ప్రజా సేవే పరమావధిగా, అకుంఠిత దీక్షతో సేవలందిస్తున్న ప్రజా సేవా సమితి గౌరవ సలహాదారు సీనియర్ జర్నలిస్ట్ తిప్పరాజు రమేష్ బాబు, కార్యవర్గ సభ్యులు బండి రాజేష్ కుమార్ రెడ్డి, సాగి సత్య సీతా రామరాజు, సుభాష్, సీనియర్ పాత్రికేయుడు విజయ్ కుమార్ రెడ్డి, ఈశ్వర్ రావు, శివ శంకర రావు ఆధ్వర్యంలో సోమవారం మణికొండ ఎంప్లాయిస్ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్సిళ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా సమితికి సంఘ సేవకుడు మాదిరెడ్డి పెంటా రెడ్డి, బీజేపీ మణికొండ శాఖ అధ్యక్షుడు కంకణాల శివ రామరెడ్డి, సంఘ సంస్కర్త, ఆమ్ ఆద్మీ ఫోరమ్ చైర్మన్ మాసూద్ మొహమ్మద్, ఎమ్ ఆర్ పి ఎస్ నాయకుడు కుమ్మరి సత్యనారాయణ, షేక్ పెట్ మిత్ర బృందం సభ్యులు రేణికుంట భాస్కర్, సుధా రామకృష్ణ, సాయి, విష్ణు, విద్యావేత్తలు, మానవతావాదులు మహమ్మద్ ఇక్బాల్, షాకిర్ ఆలీ, మరియాల మల్లేష్ మనోహర్ రామారావు, వెంకట్ రెడ్డి, బబ్లూ హర్షా రెడ్డి , పాఠశాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం

# ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లా

## ' మీకోసం ' అర్జీల పరిష్కారానికి జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి



**జులై 13 .అక్షర టైమ్స్ :** కలెక్టర్ పి. రాజాబాబు స్పష్టం చేశారు. సోమవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన ' మీకోసం ' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, డిఆర్ఓ పి.వెంకటరమణ, డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ రెడ్డి, డిపిఓ అనుపమ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి చిరంజీవి అధికారులతో కలిసి ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 261 అర్జీలు వచ్చాయి. వీటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కింద స్థాయి సిబ్బంది ఇచ్చే నివేదికలపై ఆధారపడకుండా జిల్లా స్థాయి అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. మీకోసం ' అర్జీలకు పరిష్కారం, ఐ.వి.ఆర్.ఎస్. ఫోన్ కాల్స్ లో సానుకూల ప్రజాభిప్రాయం పెంపు కోసం ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నందున అధికారులు కూడా ఇదే స్ఫూర్తితో మరింత చురుకుగా పనిచేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ' మీకోసం ' అర్జీలకు సకాలంలో సహేతుక పరిష్కారం చూపాలని ఆయన స్పష్టం చేశారు. రెవెన్యూ సంబంధిత అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వివరాలను అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పొలాలకు వెళ్ళటానికి దారి ఇవ్వండి



**దర్శి,జులై 13 .అక్షర టైమ్స్ : (రిపోర్టర్ ఎస్. సత్యనారాయణ)** కురిచేడు మండలం, నమశ్శివాయపురం గ్రామపంచాయతీ పరిధిలోని మల్లాయపాలెం రెవిన్యూ ఇలాకాలో సర్వే నెంబర్ 44/4ఏ, 52/3, 70/2 మరి కొన్ని సర్వే నెంబర్లు విస్తీర్ణము 26.52 సెంట్ల లో ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసి అక్రమంగా ప్రజలకు మాయమాటలు చెప్పి ఇతర ప్రాంతాల నుండి ఏజెంట్ల ద్వారా, క్రయవిక్రయాలను జరుపుతున్నారు. దీనిపై నమశ్శివాయపుర గ్రామపంచాయతీ మాజీ సర్పంచి అయిన సిద్దిన వెంకట రమణమ్మ మరియు ఎంపీటీసీ సిద్ధిన నరసింహ సుబ్బారావులు ఇరువురు కలిసి వెంచర్ వేస్తున్న యజమానిని కలిసి ఎటువంటి అనుమతులు లేకుండా ప్రధానంగా గ్రామ పంచాయతీ తీర్మానం, ఆర్డిఓ ద్వారా భూమి కన్వర్షన్ ఏమీ లేకుండా మా పొలాలను ఇండ్ల స్థలాలుగా మార్చి క్రయవిక్రయాలు జరపటం విరుద్ధమని, అలాగే మా గ్రామస్తులు పొలాలకు పోవటానికి దారి లేకుండా అడ్డంగా స్తంభాలు, కంచవేసి పొలాలకు రాకపోకలు నిలిపివేయబడినవి. దీనిపై యజమానిని నిలదీయగా ఈ విషయాన్ని రాజకీయ రంగు పులిమి దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మీపై నింద, ఆరోపణలు చేస్తూ ఒక పత్రికలో ప్రకటన ఇవ్వడాన్ని మేము (కురిచేడు మండల తెలుగుదేశం పార్టీ) ఖండిస్తున్నామన్నారు. ఖండించిన వారిలో కురిచేడు మండల పార్టీ అధ్యక్షులు విడతల నెమలెయ్య, కాట్రాజు నాగరాజు , మొఘల్ మస్తాన్వలి, సిద్ధన వెంకటరమణ, సిద్ధన నరసింహ సుబ్బారావు, కేసనపల్లి సువయ్య, గణపతి వెంకటేశ్వర్లు, అచ్చనాల ఏడుకొండలు, పాపిశెట్టి వెంకటరామయ్య, గండి సుంకరరావు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మరణించిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ. 5 లక్షల భీమా చెక్కు అందజేసిన అశోక్ రెడ్డి



**గిద్దలూరు,జులై 13 .అక్షర టైమ్స్ :** బేస్తవారిపేట మండలం, అక్కపల్లె గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కొమ్మ రంగమ్మ ఇటీవల జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆమె పార్టీ సభ్యత్వం తీసుకున్నందున, తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధి నుండి రూ. ఐదు లక్షల రూపాయల ప్రమాద భీమా నగదు మంజూరైంది. ఈ భీమా నగదు చెక్కును గిద్దలూరు శాసనసభ్యులు అశోక్ రెడ్డి మృతురాలి భర్త అయినటువంటి కొమ్మ పెద్ద సైదయ్య కి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తల సంక్షేమమే పరమావధిగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మరియు యువ నాయకులు నారా లోకేష్ ఈ సంక్షేమ నిధిని ఏర్పాటు చేశారని, ప్రమాదవశాత్తు ఏ కార్యకర్త అయినా మరణిస్తే, వారి కుటుంబాలు ఆర్థికంగా రోడ్డున పడకుండా కొండంత అండగా నిలవడమే ఈ సంక్షేమ నిధి ముఖ్య ఉద్దేశమన్నారు. కొమ్మ రంగమ్మ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ మరియు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటామని, భవిష్యత్తులో ఎలాంటి అవసరం వచ్చినా ఆదుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు యువ నాయకులు నారా లోకేష్ ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సొరెడ్డి మోహన్ రెడ్డీ, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అక్కపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

## గిద్దలూరు లో సైకిల్ ఎక్కిన 80 కుటుంబాలు

**ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ లో చేరిన వైసీపీ కార్యకర్తలు**



**గిద్దలూరు,జులై 13 .అక్షర టైమ్స్ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వలసల పర్వం కొనసాగుతోంది తాజాగా గిద్దలూరు నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 80 బీసీ ఎస్టీ కుటుంబాలకు చెందిన వారు వైయస్సార్సీపీ ని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. రాచర్ల మండలం, పాలక వీడు పంచాయతి పరదిలోని అనుమల వీడు గ్రామానికి చెందిన వీరు అంబావారపు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్, ప్రస్తుత ఎంపీటీసీతో కలిసి వైసీపీ ని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి వారిని సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడి చేస్తున్న అభివృద్ధిని సంక్షేమంను చూసి ప్రజలు నమ్మకంతో పార్టీలో చేరుతున్నారు అని చేరిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచర్ల మండల పార్టీ అధ్యక్షులు కటిక యోగానందు, శ్రీనివాసులు, దివాకర్, అల్లూరుయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆనందాశ్రమంలో ఆరుద్రోత్సవం





**దొనకొండ,జులై 13 .అక్షర టైమ్స్ :** దొనకొండ శ్రీ ఆనందాశ్రమంలో ఆరుద్ర నక్షత్ర యుక్త మసశివరాత్రి సోమవార పర్వదినం పురస్కరించుకుని శ్రీ అన్నపూర్ణ సహిత కాశి విశ్వేశ్వర స్వామి వారికి తెల్లవారుజాము 5 గంటల నుండి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు అన్నాభిషేకము సహస్ర బిల్వార్చన పూజలు శ్రీ గోవిందమాంబ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తమ స్వహస్తాలచే స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. చతుర్దశి ఆరుద్ర నక్షత్రం మాస శివరాత్రి సోమవారం స్వామి వారికి చేసే అభిషేకాలు 100 మహా శివరాత్రులతో సమానమని ఆశ్రమ అర్చకులు మని బాబు శర్మ తెలియజేశారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

## వన్ వార్డ్ ఎవ్రీ డే' బీరంగూడలో

# అధికారుల క్షేత్రస్థాయి పర్యటన




**సైబరాబాద్,జులై 13 .అక్షర టైమ్స్ : ప్రతినిధి ఎం.వీరేష్** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వన్ వార్డ్ ఎవ్రీ డే' కార్యక్రమంలో భాగంగా ఉన్నతాధికారులు అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడలో పర్యటించారు. మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ మరియు ఇతర శాఖల అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. బీరంగూడ తులసివనంలో స్థానిక ప్రజలు, నివాసితుల సంఘాల ప్రతినిధులతో అధికారులు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా నివాసితులు తమ ప్రాంతంలోని సమస్యలను అధికారుల ముందు ఉంచారు. ముఖ్యంగా సీసీ రోడ్ల నిర్మాణం, మురుగునీటి పారుదల వ్యవస్థ, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, నాలాల పూడికతీత, వీధి దీపాల నిర్వహణపై చర్చించారు. వీటితో పాటు పార్కుల అభివృద్ధి, నీటి సరఫరా మెరుగుదల, ఇంటింటి చెత్త సేకరణ, రహదారులపై ఆక్రమణల తొలగింపు మరియు శ్మశానవాటిక ఆధునీకరణ వంటి అంశాలను ప్రజలు అధికారుల దృష్టికి తెచ్చారు. ప్రజల నుంచి స్వీకరించిన విజ్ఞప్తులను పరిశీలించిన కమిషనర్, అత్యవసరమైన పనులను వెంటనే చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను నేరుగా తెలుసుకోవడం ద్వారా పరిష్కార మార్గాలను వేగవంతం చేయడం సాధ్యపడుతుందని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని కమిషనర్ వివరించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనులను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జారీ చేసినది సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

## భద్రతకు నిఘా కెమెరాలే భరోసా..

## ప్రతి వ్యాపార సంస్థలో తప్పనిసరి ఏసీపీ చక్రపాణి




**కీసరజులై 13 .అక్షర టైమ్స్ : -ప్రతినిధి గోపగాని పాండు** నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంలో నిఘా కెమెరాల పాత్ర అత్యంత కీలకమని జవహర్‌నగర్ సహాయ పోలీసు కమిషనర్ చక్రపాణి పేర్కొన్నారు. కీసర ప్రధాన కూడలిలోని అంజనాస్ కిచెన్ భోజనశాలలో ఏర్పాటు చేసిన ఎనిమిది నిఘా కెమెరాలను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆ కెమెరాలను కీసర పోలీసు స్టేషన్ పరిధిలోని పోలీసు నిఘా వ్యవస్థతో అనుసంధానం (జియో ట్యాగింగ్) చేయించారు. ఈ సందర్భంగా ఏసీపీ చక్రపాణి మాట్లాడుతూ, రద్దీ ప్రాంతాల్లో ఉన్న భోజనశాలలు, వాణిజ్య సముదాయాలు, దుకాణాలు, సూపర్ మార్కెట్లు, ఇతర వ్యాపార సంస్థలు తప్పనిసరిగా నాణ్యమైన నిఘా కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి కెమెరాను పోలీసు శాఖ నిఘా వ్యవస్థతో అనుసంధానం చేయించడం ద్వారా నేరాలు జరిగిన సమయంలో నిందితులను వేగంగా గుర్తించి పట్టుకోవడం సులభమవుతుందని తెలిపారు. దొంగతనాలు, చోరీలు, గొడవలు, రోడ్డు ప్రమాదాలు వంటి ఘటనల దర్యాప్తులో నిఘా కెమెరాల దృశ్యాలు కీలక ఆధారాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. వ్యాపార సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల పూర్తి వివరాలను 'మీ సురక్ష' యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఉద్యోగుల వివరాలు నమోదు చేయడం వల్ల వారి గుర్తింపు సులభమవడంతో పాటు అవసరమైన సందర్భాల్లో పోలీసులకు సమాచారం అందుబాటులో ఉంటుందని తెలిపారు.ప్రజల భద్రత కోసం పోలీసు శాఖ చేపడుతున్న సాంకేతిక ఆధారిత చర్యలకు ప్రతి వ్యాపారవేత్త, సంస్థ యాజమాన్యం సహకరించాలని ఏసీపీ కోరారు. ప్రజల భాగస్వామ్యంతో నేరరహిత, సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కీసర పోలీసు అధికారులు, అంజనాస్ కిచెన్ యాజమాన్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక కార్యక్రమం

ప్రయాణికుల మాటే ఆర్టీసీకి బాట.!



**కుషాయిగూడ,జులై 13 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** కుషాయిగూడ డిపోలో 'మీ డిపో మేనేజర్‌తో ప్రత్యక్ష సంభాషణ' -- సమస్యలు, సూచనలకు స్వాగతం ప్రయాణికులకు మరింత మెరుగైన, నాణ్యమైన ప్రజా రవాణా సేవలను అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కుషాయిగూడ డిపో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రయాణికుల సమస్యలు, సూచనలు, ఫిర్యాదులను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు జూలై 14న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు "మీ డిపో మేనేజర్‌తో ప్రత్యక్ష సంభాషణ" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వి. వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కుషాయిగూడ డిపో పరిధిలోని ప్రయాణికులు బస్సుల సమయాలు, మార్గాలు, సేవల నాణ్యత, సిబ్బంది వ్యవహార శైలి, ప్రయాణ సౌకర్యాలు, ఇతర రవాణా సంబంధిత అంశాలపై తమ అభిప్రాయాలు, సమస్యలు, సూచనలను ఈ కార్యక్రమం ద్వారా నేరుగా తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే విలువైన సూచనల ఆధారంగా ఆర్టీసీ సేవలను మరింత సమర్థవంతంగా, ప్రజలకు అనుకూలంగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని వివరించారు.కుషాయిగూడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ అభిప్రాయాలను వెల్లడించాలని, ఇందుకోసం 7382826145 ఫోన్ నంబర్‌కు నిర్ణీత సమయంలో సంప్రదించాలని డిపో మేనేజర్ కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రజా రవాణా సేవల్లో మరింత మెరుగైన మార్పులు తీసుకురావడం సాధ్యమవుతుందని ఆయన తెలిపారు.

## భారతి నగర్ డివిజన్‌లో మురుగునీటి పారుదల సమస్యలపై

## క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి



**పటాన్‌చెరు,జులై 13 .అక్షర టైమ్స్ : ప్రతినిధి ఎం.వీరేష్** భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజి కాలనీలో మురుగునీటి పారుదల వ్యవస్థ సమస్యలపై స్థానిక ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా జలమండలి మేనేజర్ ధనుంజయ్‌తో కలిసి సమస్యలను పరిశీలించిన ఆమె, స్థానికులు తెలిపిన ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కరించాలని సంబంధిత సహాయక ఇంజనీరును ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త మురుగునీటి పారుదల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన అమలు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నాగమణి, బిఆర్ఎస్ నాయకులు భాస్కర్ ముదిరాజ్, చిన్న, కుమార్, రాకేష్ రెడ్డి, స్వర్ణలతతో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గత కౌన్సిల్ తీర్మానాల పనులను నిర్లక్ష్యం చేయొద్దు

కమిషనర్ సృజనకు మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి వినతి

విలీనం తర్వాత డివిజన్లలో నెలకొన్న ఇబ్బందులను వివరించిన మాజీ చైర్మన్

గత మున్సిపాలిటీ ఫైళ్లను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన వైనం




**అమీన్‌పూర్,జులై 13 .అక్షర టైమ్స్ : ప్రతినిధి ఎం.వీరేష్** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి)లో విలీనమై, నూతనంగా ఏర్పడిన బీరంగూడ, అమీన్‌పూర్ డివిజన్లలో మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి గత మున్సిపల్ కౌన్సిల్‌లో చేసిన తీర్మానాల పనులను వెంటనే చేపట్టాలని అమీన్‌పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం అమీన్‌పూర్ పరిధిలో పర్యటించిన సిఎంసి కమిషనర్ సృజనని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి, గతంలో కౌన్సిల్ ఆమోదించిన తీర్మానాలకు సంబంధించిన ఫైళ్లను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ... గతంలో అమీన్‌పూర్ మున్సిపాలిటీగా ఉన్న సమయంలో స్థానిక కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అత్యవసర మౌలిక వసతుల కల్పన కోసం కౌన్సిల్ సమావేశాల్లో ప్రత్యేకంగా పలు తీర్మానాలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. అయితే, ఈ ప్రాంతాలు కార్పొరేషన్‌లో విలీనమైనప్పటి నుండి ఆయా పనులను కొనసాగించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్‌లో విలీనం తర్వాత తమ డివిజన్ల పరిధిలో ప్రజలు మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. గతంలో ప్రజల అవసరాల నిమిత్తం ఆమోదించిన తీర్మానాలపై కమిషనర్ ప్రత్యేకంగా స్పందించాలని, పెండింగ్‌లో ఉన్న ఆయా పనులకు తక్షణమే నిధులు మంజూరు చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తులసివనంతో పాటు డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి




**మేడ్చల్,జులై 13 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఎన్నికల సమయంలో, అనంతరం ప్రకటించిన సంక్షేమ హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య (టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున జర్నలిస్టులు ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఎస్.కె. సలీమా, గుమ్మడి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బనావత్ రవి నాయక్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించడం బాధాకరమన్నారు. జర్నలిస్టుల వృత్తి నిత్యం ప్రమాదాలతో కూడుకున్నదని, అలాంటి వారికి ప్రభుత్వం ప్రత్యేక రక్షణ, భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.అర్హులైన ప్రతి జర్నలిస్టుకు వెంటనే గుర్తింపు కార్డులు జారీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని, ఆరోగ్య కార్డులు అందజేసి కార్పొరేట్ వైద్య సేవలు కల్పించాలని, జర్నలిస్టుల పిల్లలకు విద్యా ఫీజుల్లో రాయితీలు అమలు చేయాలని, ఇళ్ల స్థలాల పంపిణీ హామీని నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. అలాగే మీడియా స్వేచ్ఛకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన హామీలు అమలు కాకపోవడంతో వృత్తి నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ధర్నా అనంతరం జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ బాధ్యులు, వివిధ మండలాల ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు, యువ జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

## గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ గా డాక్టర్ దాసరి రమేష్ బాధ్యతల స్వీకరణ



**గుంటూరుజులై 13 .అక్షర టైమ్స్ :** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కు వైద్య సేవలందించే సీ.జీ.హెచ్.ఎస్ (సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం) గుంటూరు చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీ.ఎం.ఓ) గా డాక్టర్ దాసరి రమేష్ సోమవారం గుంటూరు నగరంపాలెంలోని సీ.జీ.హెచ్.ఎస్ వెల్నెస్ కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. నూతన బాధ్యతలు చేపట్టిన రమేష్ ను సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు కలిసి పుష్పగుచ్చాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన అంశాలను పెన్షనర్లు సీ.ఎం.ఓ దృష్టికి తీసుకువెళ్లారు. ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధి తో కృషి చేస్తానని ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ హామీ ఇచ్చారు. ఆసుపత్రి యాజమాన్యాలతో మాట్లాడి రోగి సంరక్షణ కు అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. నాణ్యమైన, మెరుగైన వైద్యసేవలందించడమే తమ ధ్యేయమని డాక్టర్ రమేష్ తెలిపారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొండా నాగార్జున మాట్లాడుతూ..డాక్టర్ల కొరత ఉన్నప్పటికీ పెన్షనర్ల ఆరోగ్య పరిరక్షణకు ప్రతిరోజు తాను వందకు పైగా ఓ. పి సేవలను అందించినట్లు తెలిపారు. దూర ప్రాంత పేషెంట్స్ కు తొలి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు టి. వివేకానంద మాట్లాడుతూ.. విధి నిర్వహణలో డాక్టర్లు నిబద్ధత, నిస్వార్ధ సేవ ను అందించాలని కోరారు. రోగుల పట్ల మంచి మార్గదర్శకులు గా ఉండాలని సూచించారు. లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబెర్ గుమ్మడి సీతారామయ్యచౌదరి మాట్లాడుతూ. .సీ.జీ.హెచ్.ఎస్ లో ఆరోగ్య సేవలు పొందడం పెన్షనర్ల హక్కు అన్నారు. శస్త్రచికిత్సలకు అధిక రుసుము వసూలు చేసే ఎంపానెల్డ్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పెన్షనర్లు పి.వి.సత్యనారాయణ, పి. కోటేశ్వరరావు, ఎన్. ఎస్. నగేష్ బాబు, కె. సాంబ్రాజ్యం సీ.జీ.హెచ్.ఎస్ నర్సింగ్ ఆఫీసర్ హేమ సుందరి ఫార్మాసిస్టు అయోషా బేగం, సునీల్ ఉద్యోగులు పేరేశ్వరరావు, మురళీ, రామారావు పాల్గొన్నారు.

# సైబరాబాద్ నగరపాలక సంస్థ కార్యాలయంలో 'ప్రజావాణి'

ప్రజల సమస్యలకు నేరుగా వినికిడి...

పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఒకే రోజు 66 అర్జీల స్వీకరణ..

అత్యధికంగా పట్టణ ప్రణాళికా విభాగానికే 51

ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక గుర్తింపు

సంఖ్య, నిరంతర పర్యవేక్షణ లింక్: కమిషనర్





**శేర్లింగంపల్లి,జులై 13 .అక్షర టైమ్స్ : ప్రతినిధి ఎం.ఈరన్న** సైబరాబాద్ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నగరపాలక పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను కమిషనర్ మరియు వివిధ విభాగాల ఉన్నతాధికారుల దృష్టికి నేరుగా తీసుకువచ్చారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అధికారులకు మొత్తం 66 ఫిర్యాదులు అందాయి. ఇందులో అత్యధికంగా పట్టణ ప్రణాళికా విభాగానికి (టౌన్ ప్లానింగ్) సంబంధించి 51 అర్జీలు రాగా, సాంకేతిక విభాగానికి (ఇంజినీరింగ్) 8, పారిశుధ్య విభాగానికి 2, పట్టణ జీవవైవిధ్య విభాగానికి 2 చొప్పున వచ్చాయి. అలాగే విద్యుత్, ఆదాయ మార్గాల (ఆస్తి పన్ను), ఎన్నికల విభాగాలకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. సకాలంలో పరిష్కరించాలి: అధికారులకు కమిషనర్ ఆదేశం ఈ సందర్భంగా కమిషనర్ స్వయంగా ప్రజలతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులను ఆయన ఆదేశించారు. పౌర సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. సాంకేతిక పర్యవేక్షణ విధానం.. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత పెంపొందించేందుకు ప్రతి ఫిర్యాదుకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య (ఐడీ) మరియు నిరంతర పర్యవేక్షణ లింక్ కేటాయించినట్లు కమిషనర్ తెలిపారు. దీని ద్వారా ప్రజలు తమ ఫిర్యాదు ఏ దశలో ఉందో ఇంట్లోనే కూర్చుని స్వయంగా తెలుసుకునే వీలుంటుందన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా నగరపాలక సంస్థ దృష్టికి తీసుకురావడానికి ఒక మంచి వేదిక లభించిందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ ప్రజావాణిలో అందిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## నులిపురుగుల నిర్మూలనలో పాలుపంచుకున్న

## పటాన్‌చెరువు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్




**పటాన్‌చెరువు,జులై 13 .అక్షర టైమ్స్ : పతినిధి ఎం.వీరేష్** జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా, పటాన్‌చెరువు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక మందు పంపిణీ కార్యక్రమంలో పటాన్‌చెరువు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మందును స్వయంగా వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ, "రేపటి భావిభారత పౌరులుగా విద్యార్థులు ఎదగాలంటే, వారు ఆరోగ్యంగా ఉండటం ఎంతో ముఖ్యం. నులిపురుగుల వల్ల కలిగే అనారోగ్య సమస్యలను తల్లిదండ్రులు గుర్తించాలి. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ నులిపురుగుల నివారణ చుక్కల మందును ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా వేయించాలి," అని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నేత్రావతి, సూపర్వైజర్ విజయలక్ష్మి, ఏఎన్ఎంలు సునీత, నస్రత్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి స్పందన, ఉపాధ్యాయులు, ఆల్విన్ కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ, కే. నరసింహులు, అజ్మత్ అజ్జు, అఫ్జల్ మరియు ఇతరులు పాల్గొన్నారు.


## పి.సి.ఎల్-6 క్రికెట్ పోటీలలో మియాపూర్ ఛాయాగ్రాహకుల

## జట్టుకు అండగా బీజేపీ సీనియర్ నాయకుడు గోపిరెడ్డి ఓబుల్ రెడ్డి




**మియాపూర్,జులై 13 .అక్షర టైమ్స్ : ప్రతినిధి ఎం.ఈరన్న** ఉప్పల్ వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న పి.సి.ఎల్-6 క్రికెట్ పోటీలలో పాల్గొంటున్న 'మియాపూర్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్' క్రీడా జట్టుకు బీజేపీ సీనియర్ నాయకుడు గోపిరెడ్డి ఓబుల్ రెడ్డి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించాడు. మైదానంలో క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్న సంఘ సభ్యులను ఉత్సాహపరుస్తూ, వారికి రూ. 10,000/- ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా నిలిచాడు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు పానుగంటి గణేష్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం ఓబుల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపింది. తమ జట్టును ప్రోత్సహిస్తూ ఆర్థిక సాయం అందించినందుకు అతనికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసింది. క్రీడలు క్రమశిక్షణకు పునాది: గోపిరెడ్డి ఓబుల్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి సీనియర్ నాయకుడు గోపిరెడ్డి ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ, క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్నే కాకుండా యువతలో క్రమశిక్షణను, జట్టు స్ఫూర్తిని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నాడు. "వృత్తిపరమైన ఒత్తిడిలో ఉన్నప్పటికీ, క్రీడల పట్ల మీకున్న ఆసక్తి, నిబద్ధత నిజంగా అభినందనీయం. మియాపూర్ ఛాయాగ్రాహకుల జట్టు ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, విజేతగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను," అని అతడు ఆకాంక్షించాడు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, క్రికెట్ జట్టు క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పీఎంఎస్ అంటే ఏమిటి?



పీఎంఎస్ అనేది నెలసరి రావడానికి కొన్ని రోజుల ముందు మహిళల్లో కనిపించే శారీరక, మానసిక, భావోద్వేగ మార్పుల సమూహం. సాధారణంగా నెలసరి ప్రారంభానికి ఒకటి నుండి రెండు వారాల ముందు ఈ లక్షణాలు మొదలై, నెలసరి వచ్చిన తరువాత తగ్గిపోతాయి.

### పీఎంఎస్ యొక్క ముఖ్య లక్షణాలు

భావోద్వేగ లక్షణాలు
చిరాకు ఎక్కువగా ఉండటం
కోపం త్వరగా రావడం
చిన్న విషయానికే బాధపడటం
కారణం లేకుండా ఏడుపు రావడం
ఆందోళన పెరగడం
మనసు బరువుగా అనిపించడం
నిరుత్సాహం
మానసిక లక్షణాలు
ఏకాగ్రత తగ్గడం
మరచిపోవడం
నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బంది
ప్రతికూల ఆలోచనలు పెరగడం

### శారీరక లక్షణాలు

అలసట
తలనొప్పి
కడుపు ఉబ్బరం
శరీర నొప్పులు
నిద్రలో మార్పులు
ఆకలి పెరగడం లేదా తగ్గడం

### ప్రవర్తనా లక్షణాలు

ఇతరులతో మాట్లాడాలనిపించకపోవడం
కుటుంబ సభ్యులపై ఎక్కువగా స్పందించడం
పనులపై ఆసక్తి తగ్గడం
ఒంటరిగా ఉండాలనిపించడం

### ఒక సాధారణ ఉదాహరణ

లక్ష్మి అనే మహిళను ఊహించుకుందాం.

సాధారణ రోజుల్లో ఆమె పిల్లలు కొంచెం అల్లరి చేసినా ప్రశాంతంగా మాట్లాడుతుంది.

కానీ నెలసరి రావడానికి నాలుగు లేదా ఐదు రోజుల ముందు అదే పరిస్థితిలో పిల్లలు కొంచెం అల్లరి చేస్తే ఆమెకు చాలా కోపం వస్తుంది. తర్వాత తాను ఎందుకు అంతగా స్పందించానో బాధపడుతుంది.ఇది ఆమె స్వభావంలో వచ్చిన మార్పు కాదు. శరీరంలో జరుగుతున్న సహజ మార్పుల ప్రభావం.

### మనోవిజ్ఞాన నిపుణుడి దృష్టిలో

ఈ సమయంలో మహిళలు కేవలం శారీరక అసౌకర్యాన్ని మాత్రమే అనుభవించరు. భావోద్వేగాలను నియంత్రించడం కూడా కొంత కష్టమవుతుంది. ఉదాహరణకు,స్నేహితురాలు ఒక రోజు ఫోన్ చేయకపోతే సాధారణ రోజుల్లో "బిజీగా ఉండి ఉంటుంది" అని అనుకుంటారు.అదే పీఎంఎస్ సమయంలో "నన్ను పట్టించుకోవడం లేదు" అని భావించే అవకాశం ఉంటుంది.అంటే పరిస్థితి మారలేదు. కానీ దానిని చూసే మనసు కొంత సున్నితంగా మారింది.

### మనోవిజ్ఞాన నిపుణులు ఎలా సహాయం చేస్తారు?

అవగాహన కల్పించడం మొదటగా ఈ మార్పులు ఎందుకు వస్తున్నాయో వివరంగా చెబుతారు."మీరు బలహీనులు కాదు. మీలో జరుగుతున్న సహజ మార్పుల వల్ల ఈ లక్షణాలు కనిపిస్తున్నాయి" అని అర్థమయ్యేలా చెబుతారు.

### భావోద్వేగాలను గుర్తించడం

ఏ రోజుల్లో చిరాకు ఎక్కువగా వస్తోంది?
ఏ పరిస్థితుల్లో కోపం పెరుగుతోంది?
ఏ సమయంలో బాధ ఎక్కువగా అనిపిస్తోంది?
ఇవన్నీ నమోదు చేయమని సూచిస్తారు.
దీనివల్ల ఒక క్రమం కనిపిస్తుంది.

### ఆలోచనలను పరిశీలించడం

ఈ సమయంలో ప్రతికూల ఆలోచనలు ఎక్కువగా రావచ్చు.
ఉదాహరణకు:
"ఎవరూ నన్ను అర్థం చేసుకోరు"
అనే ఆలోచన వస్తే,
"ప్రస్తుతం నేను భావోద్వేగంగా సున్నితంగా ఉన్నాను. కొంత సమయం తర్వాత ప్రశాంతంగా ఆలోచిస్తాను"
అనే విధంగా ఆలోచించడం నేర్పిస్తారు.

### మనసుకు ప్రశాంతత కలిగించే పద్ధతులు

నెమ్మదిగా లోతైన శ్వాస తీసుకోవడం
ధ్యానం చేయడం
తేలికపాటి నడక
సరిపడ నిద్ర
విశ్రాంతి తీసుకోవడం
ఇవి లక్షణాలను తగ్గించడంలో సహాయపడతాయి.

### కుటుంబ సభ్యులకు మార్గదర్శనం

చాలాసార్లు కుటుంబ సభ్యులు ఈ పరిస్థితిని అర్థం చేసుకోలేకపోతారు.
ఈ సమయంలో ఇలా మాట్లాడకూడదు:
"నువ్వు అతిగా స్పందిస్తున్నావు."
"ఇది నీ ఊహ మాత్రమే."
బదులుగా ఇలా మాట్లాడాలి:
"ఈ రోజు నీకు కొంచెం ఇబ్బందిగా ఉన్నట్లు అనిపిస్తోంది."
"నేను ఏమైనా సహాయం చేయగలనా?"
ఇలాంటి మాటలు మహిళలకు ఎంతో మానసిక బలం ఇస్తాయి.

### ముఖ్యమైన సందేశం

పీఎంఎస్ అనేది బలహీనత కాదు. ఇది ప్రతి మహిళలో ఒకే విధంగా కనిపించకపోయినా, చాలామందిలో కనిపించే సహజ పరిస్థితి.సరైన అవగాహన, కుటుంబ మద్దతు, ఆరోగ్యకరమైన జీవనశైలి, అవసరమైతే మనోవిజ్ఞాన సహాయం ద్వారా ఈ సమయంలో కలిగే ఇబ్బందులను చాలా వరకు తగ్గించుకోవచ్చు. "ఈ సమయంలో మీ భావాలు నిజమైనవే. అయితే వాటి తీవ్రత సహజ శారీరక మార్పుల వల్ల పెరిగి ఉండవచ్చు. అందుకే ఈ రోజుల్లో మీ పట్ల మీరు మరింత దయతో, సహనంతో ఉండటం చాలా అవసరం."



దీప్తి దామర్ల
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్
అంబవరం సెంటర్ ఫర్ సైకలాజికల్ రీసెర్చ్ అండ్
వెల్బీయింగ్ అసోసియేషన్ ,విజయవాడ,ఆంధ్రప్రదేశ్

# కావలి ఇండియన్ గ్యాస్ వినియోగదారుల అవస్థలు

## ఆర్డీఓ కు వినతిపత్రం



**కావలి,జులై13.అక్షర టైమ్స్:-** కావలి మున్సిపల్ పరిధిలోని ఇండియన్ గ్యాస్ వినియోగదారులు పడుతున్న అవస్థలపై సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం దక్షిణాంధ్ర రీజినల్ చైర్మన్ మొహమ్మద్ అబ్దుల్ అలీం ఆర్డీఓ కార్యాలయంలో పరిపాలనాధికారి కి వినతిపత్రం ద్వారా సమస్యలను తెలియచేయడం జరిగింది. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా అబ్దుల్ అలీం మాట్లాడుతూ గతంలో కావలి పట్టణంలో హైమ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఇండియన్ గ్యాస్ సిలిండర్లను సరఫరా చేసేవారని, ఆ గ్యాస్ ఏజెన్సీ ని మూసివేసిన తర్వాత కావలి పట్టణంలోని ఇండియన్ గ్యాస్ వినియోగ దారులకు జలదంకి గ్రామం నుండి గ్యాస్ సిలిండర్లను సరఫరా చేసేవారని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన నిబంధనల ప్రకారం పట్టణ ప్రాంతం వాసులకు 24 రోజులకు ఒక సిలిండర్, పల్లె ప్రాంతం వాసులకు 45 రోజులకు ఒక సిలిండర్ ఇచ్చే విధంగా గ్యాస్ ఏజెన్సీ వారు గ్యాసును సరఫరా చేస్తున్నారు. దీనివల్ల కావలిలో నివాసం వుంటూ, ఆధార్ ప్రకారం అడ్రెస్స్ కూడా కావలి లోనే వున్నా జలదంకి లోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వారు మాత్రం కావలి పట్టణ వాసులకు 45 రోజులకు ఒకసారి గ్యాస్ సిలిండర్ ను సరఫరా చేస్తున్నారన్నారు. అందువల్ల పట్టణంలో నివాసం ఉంటున్న వారు గ్యాస్ అయిపోయినప్పుడు విధిలేనిపరిస్థితిలో ఒక సిలిండరును రెండు వేల రూపాయలకు పైగా వెచ్చించి బ్లాక్ లో కొనుగోలు చేయవలసిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కావలి మున్సిపల్ పరిధిలోని ఇండియన్ గ్యాస్ కనెక్షన్లను కావలి పట్టణంలోగల ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ కు బదిలీ చేయాలని ఆర్డీఓ ను కోరడం జరిగిందని తెలిపారు.

# "హర్మూజ్ జలసంధిని మేమే స్వాధీనం చేసుకుంటాం- ఇకపై మాకే డబ్బులు కట్టాలి": ట్రంప్

**హర్మూజ్? జలసంధిని తామే స్వాధీనం చేసుకుంటామని**
**ట్రంప్ సంచలన వ్యాఖ్యలు- కాల్పుల విరమణ ఒప్పందాన్ని**
**ఇరాన్ ఉల్లంఘించిందని ఆరోపణ- ఇరాన్‌పై మళ్లీ అమెరికా**
**భీకర దాడులు**



ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకంగా ఉన్న హర్మూజ్ జలసంధి విషయంలో అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించిందని ఆరోపించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్- హర్మూజ్ జలసంధిని తామే స్వాధీనం చేసుకుంటామని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక్కడ ఇరాన్‌కు ఎలాంటి నియంత్రణ ఉండబోదని ఘాటు హెచ్చరికలు చేశారు. ఇదే సమయంలో అమెరికా సైన్యం ఇరాన్‌పై మరోసారి భీకర వైమానిక దాడులు నిర్వహించగా, ఇరాన్ కూడా యూఎస్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ దాడులకు ప్రతిస్పందిస్తోంది. దీంతో పశ్చిమాసియాలో మరోసారి పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన టెలిఫోన్ ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో జరిగిన చర్చల్లో కాల్పుల విరమణకు సంబంధించిన అన్ని అంశాలపై ఇప్పటికే ఒప్పందం కుదిరిందన్నారు. అయితే చివరి క్షణంలో ఇరాన్ వెనక్కి తగ్గి కొత్త మార్పులు కోరిందని ఆరోపించారు. మేమే సంరక్షిస్తాం- మాకు డబ్బులు కట్టాలి: ట్రంప్ 'నిన్న 11 గంటలపాటు సమావేశం జరిగింది. అన్ని అంశాలపై అంగీకారం కుదిరింది. సమావేశం ముగిసిన తర్వాత మళ్లీ ఫోన్ చేసి కొన్ని మార్పులు చేయాలని చెప్పారు. గత 47 ఏళ్లుగా ఇరాన్ ఇలానే వ్యవహరిస్తోంది. ఇది చాలా కాలం కిందటే ముగియాల్సిన అంశం.' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ ఇప్పటివరకు అమెరికాతో కుదుర్చుకున్న అనేక ఒప్పందాల్ని ఉల్లంఘించిందని కూడా ఆయన ఆరోపించారు. 'వారితో ఇప్పటికే 10 ఒప్పందాలు చేసుకున్నాం. ప్రతిసారీ అవే ఉల్లంఘించారు. ఇక మీదట వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయి. హర్మూజ్ జలసంధిని మేమే నియంత్రిస్తాం. అందుకు మాకే డబ్బులు చెల్లించాలి. మా ఆధీనంలోనే ఉంచుకుంటాం. నిర్వహణ బాధ్యతల్ని కూడా మేమే చేపడతాం. సంరక్షకులుగానూ వ్యవహరిస్తాం. ఇప్పటివరకు ఎలాంటి ప్రతిఫలం లేకుండానే అమెరికా ఆ జలసంధికి రక్షణ ఇస్తూ వచ్చింది. ఇక ఆ పరిస్థితి ఉండదు. ధనిక దేశాలు చెల్లింపులు చేయాల్సిందే. మా వాళ్లను ప్రమాదంలో పడేసినందుకు ఇది పరిహారం' అని హెచ్చరించారు ట్రంప్. ట్రంప్ వ్యాఖ్యలతో పాటు అమెరికా సెంట్రల్ కమాండ్ ) కూడా జులై 12న ఇరాన్‌లోని పలు కీలక సైనిక స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ప్రకటించింది. అధికారిక ప్రకటన ప్రకారం- ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత రాడార్ కేంద్రాలు, క్షిపణి, డ్రోన్ మౌలిక సదుపాయాలు, ఫాస్ట్ అటాక్ మిలిటరీ బోట్లను లక్ష్యంగా చేసుకొని ఈ దాడులు జరిపినట్లు వెల్లడించింది. దాడులు చేసిన దానికి సంబంధించిన వీడియోలను కూడా విడుదల చేసింది. అమెరికా దాడుల్ని తీవ్రంగా ఖండించిన ఇరాన్ మరోవైపు అమెరికా చర్యల్ని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. గత 24 గంటల్లో అమెరికా జరిపిన దాడులు ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను ఉల్లంఘించడమే కాకుండా, అంతర్జాతీయ శాంతి భద్రతలకు కూడా తీవ్రమైన ముప్పుగా మారాయని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. అమెరికా హర్మూజ్ జలసంధి భద్రతా వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం వల్ల ప్రపంచ సముద్ర వాణిజ్య రవాణాపై ప్రతికూల ప్రభావం పడుతోందని కూడా ఇరాన్ ఆరోపించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది అమెరికానేనని, ఇరాన్ రవాణా మౌలిక సదుపాయాలు, ఫిషింగ్ బోట్స్, ఇతర వాతావరణ కేంద్రాలపై దాడులు జరిపిందని పేర్కొంది. ఇరాన్ కూడా భీకర దాడులు- అంతర్జాతీయ మీడియా ఇదే సమయంలో ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయిా మాట్లాడుతూ- అమెరికాతో కుదిరిన అవగాహనా ఒప్పందం ప్రస్తుతం సంక్లిష్ట దశలోకి వెళ్లిందన్నారు. హర్మూజ్ జలసంధికి సంబంధించి ఇరాన్‌కు ఇచ్చిన గడువు పూర్తికాకముందే అమెరికా ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆయన ఆరోపించారు. అమెరికా కావాలనే ఈ ఒప్పందాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేసిందని కూడా విమర్శించారు. ఈ పరిణామాల మధ్య ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కూడా ప్రతిస్పందించింది. అమెరికా తాజా దాడులకు ప్రతీకారంగా ఒమన్, బహ్రెయిన్, కువైట్ ప్రాంతాల్లోని లక్ష్యాలపై దాడులు జరిపినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అమెరికా లేదా దాని మిత్రదేశాలు మరోసారి సైనిక చర్యలకు దిగితే మరింత తీవ్ర ప్రతిస్పందన తప్పదని ఇరాన్ ఇప్పటికే హెచ్చరించింది. ఇటు మరోసారి హర్మూజ్ కేంద్రంగా ఉద్రిక్తతలు పెరుగుతుండటంతో అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

## శేరిలింగంపల్లిలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ: లబ్ధిదారుల ముఖాల్లో ఆనందాల వెల్లువ





**శేర్లింగంపల్లిజులై 13 .అక్షర టైమ్స్ : ప్రతినిధి ఎం.ఈరన్న** పేద కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, ముఖ్యమంత్రి ఆశయాల మేరకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'కళ్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలు ఎంతో మందికి ఆసరాగా నిలుస్తున్నాయి. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నందు నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన లబ్ధిదారులైన అక్కాచెల్లెమ్మలకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు అరికెపూడి గాంధీ, తెలంగాణ యాదవ కురుమ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ కలిసి పాల్గొని లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద తల్లిదండ్రులకు కొండంత అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, కొండాపూర్ మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్, ఏ. శ్రీనివాస్ యాదవ్, మోహన్ ముదిరాజ్ మరియు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే పై తెలుగు యువత నేత హర్ష తీవ్ర ఆరోపణలు




**కావలి,జులై13.అక్షర టైమ్స్:-** కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిపై తెలుగు యువత నాయకుడు హర్ష తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. సోమవారం కావలి జర్నలిస్ట్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కాంట్రాక్టుల కేటాయింపులో పారదర్శకత లేదని ఆరోపించారు. అధికారాన్ని ప్రజాసేవకు కాకుండా కొందరి ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారంటూ మండిపడ్డారు. కావలిలో చేపడుతున్న ప్రభుత్వ పనుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, అనుచరులకే కాంట్రాక్టులు దక్కుతున్నాయని హర్ష ఆరోపించారు. అన్ని వర్గాల కాంట్రాక్టర్లకు సమాన అవకాశాలు కల్పించకుండా రాజకీయ ప్రాధాన్యతల ఆధారంగా పనులు అప్పగిస్తున్నారని అన్నారు. దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు న్యాయం జరుగడం లేదని, వారి సమస్యలను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని హర్ష విమర్శించారు. సామాజిక న్యాయం పేరుతో హామీలు ఇచ్చినా, ఆచరణలో వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు, ప్రజా నిధుల వినియోగంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఈ అంశాలన్నింటినీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్తానని హర్ష తెలిపారు. అవసరమైతే సంబంధిత అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేసి పూర్తి స్థాయి విచారణ జరిపించాలని కోరుతానన్నారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పనుల్లో పూర్తి పారదర్శకత పాటించాలని హర్ష డిమాండ్ చేశారు. ప్రజా ధనాన్ని కాపాడటం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పాలన సాగించాలని ఆయన పేర్కొన్నారు.

## నాగార్జున స్కూల్లో ప్రజాస్వామ్య విలువలపై అవగాహన..

### మాక్ ఎలక్షన్ - 2026 నిర్వహణ







**పొదలకూరు,జూలై 13.అక్షర టైమ్స్:-రిపోర్టర్ ఆనంద్** విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాముఖ్యత, బాధ్యతాయుత పౌరసత్వంపై అవగాహన కల్పించేందుకు పొదలకూరు పట్టణంలోని నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ సోమవారం "మాక్ ఎలక్షన్--2026" కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత ,స్కూల్ కరస్పాండెంట్ ఎం. సుధాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు.విద్యార్థులు చిన్నప్పటి నుంచే ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియ, ఓటు విలువ, మంచి నాయకత్వ లక్షణాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి బాధ్యతగల పౌరులు, నాయకులని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎన్నికల ప్రక్రియను ప్రత్యక్షంగా నిర్వహించి, అభ్యర్థుల ప్రచారం, రహస్య ఓటింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వంటి దశలను అనుభవాత్మకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు ప్రాముఖ్యత, నిష్పాక్షిక ఎన్నికల అవసరం, రాజ్యాంగబద్ధ బాధ్యతలపై ప్రిన్సిపాల్ లక్ష్మీ దుర్గ,ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.పాఠశాల యాజమాన్యం సుబ్బారావు, చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత నిర్ణయ సామర్థ్యం, ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం జీ.వీ.ఆర్ ,పాపయ్య,కృష్ణ ,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమెరికాలో గుండెపోటుతో తెలుగు టెకీ హఠాన్మరణం

యూఎస్ లో గుండెపోటుతో ప్రాణాలు విడిచిన తెలుగు టెకీ రవిశంకర్ - రవిశంకర్ హఠాన్మరణంతో కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు - ఈ నెల 15న అక్కడే రవి అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లుద హార్ట్ ఎటాక్ అనే పదం ప్రతి ఒక్కరిలో వణుకు పుట్టిస్తోంది. ఇటీవల కాలంలో గుండెపోటు వయసుతో సంబంధం లేకుండా వస్తోంది. ఒకప్పుడు యాభై సంవత్సరాలు పైబడిన వారిలో కనిపించే ఈ గుండెపోటు, ఇప్పుడు చిన్నారులను సైతం బలి తీసుకుంటోంది. దీంతో నేటి ఉరుకుల పరుగుల లోకంలో, మారుతున్న ఆహారపు అలవాట్లకు చిన్న గుండెను పదిలం చేసుకోలేక మనుషులు మధ్యలోనే ప్రాణాలను వదిలేస్తున్నారు. అప్పటి వరకు ఆనందంగా ఉంటూ అంతలోనే ప్రాణాలు విడుస్తున్నారు. దీంతో ఆయా కుటుంబాలకు తీరని వేదన మిగులుతోంది. తాజాగా అమెరికాలో గుండెపోటుతో తెలుగు టెకీ మరణించాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అనకాపల్లికి చెందిన ముత్తా నూకరాజు, వరలక్ష్మి దంపతుల కుమారుడు రవిశంకర్(38). రవిశంకర్ ఉద్యోగ రీత్యా భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి జార్జియాలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలోనే రవిశంకర్? జులై 10న ఉన్నట్టుండి కార్డియాక్ అరెస్ట్‌కు గురయ్యాడు. తీవ్రమైన ఛాతి నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు అతడిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇవాళ ప్రాణాలు విడిచాడు. రవిశంకర్ హఠాన్మరణం అతని

# బాబోయ్ బుల్లితెర



సమాజం మారుతున్న కొద్దీ విలువలు మారడం కాదు, మారుతున్న సమాజానికి అనుగుణంగా విలువలు శాశ్వతంగా ఉండేలా చూడాలి టీవీ ఛానళ్లు. ముఖ్యంగా మానవ ఔన్నత్యం కోసం ఆయా రంగాల్లోని నిష్ణాతులైన వారితో చర్చలు జరిపిస్తూ పరిపూర్ణ మానవ సమాజం కోసం పురాణ వ్మాయం నుంచి కానీ, ఆధునిక సాహిత్యం నుంచి కానీ సందేశాలను తీసుకొని వాటిని ప్రదర్శించాలి. అలా అని మన జీవితాలను శాసించే ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు కాలంతో ఎలాగూ మారుతాయి! అదే సమయంలో ఈ సమాజం మనగడకు, వికాసానికి మీడియా మాధ్యమాలు శాశ్వత విలువలను ఎప్పుడూ ఏదో ఒక రూపంలో అందిస్తూనే ఉండాలి. ధారావాహికల్లో (సీరియళ్లు).. హింస, పరపీడనం, డాబు- దర్పాల ప్రదర్శన, ఒకరి మీద మరొకరు కుట్రలు, కుయుక్తులు చేసుకోవడం, పన్నాగాలు పన్నడం, హత్యా ప్రయత్నాలు, చిన్న పిల్లల వయసుకు మించి డైలాగులు చెప్పించడం తప్ప ఇంకేమీ కనిపించడం లేదు. దీనివల్ల 'ఇలాగే ఉండాలేమో' అని ప్రేక్షకులు అనుకరించే ప్రయత్నం చేస్తారు. ముందుముందు కూడా ఇదే పోకడలకు పోతే సమాజం విచ్ఛిన్నమవుతుంది. ఇంతకాలం పురాణాలతోనో, నాటకాల ద్వారానో, పాటల ద్వారానో, శతకాల ద్వారానో నీతినియమాలు, ధర్మ లక్షణాలు చెప్పించి, వాటిని శ్రోతలు, పాఠకుల మనసుల్లోకి ఎక్కించేవారు. అలా స్థిరంగా ఆచరించడం వల్లనే వ్యవస్థ పరంగాను, సంస్కృతి పరంగాను, వారసత్వ పరంగానూ వేల సంవత్సరాల నుంచి భారతదేశం కుటుంబ విలువలను నిలుపుకొంటూ వస్తున్నది. రానురాను నాటకాల ప్రదర్శనలు తగ్గిపోయాయి. ప్రేక్షకుల ఆదరణ లేకపోవడం, ప్రదర్శనల ద్వారా వారికి తగినంత ఆదాయం రాకపోవడం అందుకు ప్రధాన కారణాలు. శాస్త్రసాంకేతిక రంగాలు దూసుకురావడం, వేగం పెరగడం, ప్రజలు కూడా ఉరుకుల పరుగుల జీవితానికి అలవాటు పడటం మొదలైన కర్ణుడి చావుకు అనేక కారణాల వలెనేసంహితం=సాహిత్యం కాస్తా 'కు' హితం అవుతున్నది. ఈ నేపథ్యంలోనే సీరియళ్లు దూసుకువచ్చాయి. అయితే, వాటి పోకడ మరీ దారుణంగా తయారైంది. సీరియళ్లలో ఆడవాళ్ల దుర్మార్గాలు, దాష్టీకాల వల్ల సమాజంలో తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయి. ప్రస్తు త కుటుంబాలపై వాటి ప్రభావం ఎంతో ఉన్నది.

'ఇవన్నీ తెలిసి మీరెందుకు సీరియల్ చూస్తున్నారు' అని ఎవరైనా నన్ను ప్రశ్నించవచ్చు. అందులోని మంచి చెడులను చెప్పడానికి నేనూ సీరియళ్లు చూస్తాను. ఆదిశంకరుల వంటివారు కూడా ఉభయభారతితో వాదనలో శృంగారపరమైన చర్చ వచ్చినప్పుడు కాస్త గడువు కోరి రాజు శరీరంలో పరకాయ ప్రవేశం చేశారు. ఏదైనా విషయం గురించి మంచి, చెడు చెప్పాలంటే మనకు తొలుత తెలిసి ఉండాలి కదా! మహిళలకు క్రూర మనస్తత్వం ఉన్నట్టు సీరియళ్లలో చూపించడం వల్ల మహిళలకే నష్టం. ఒక సీరియల్‌లో చిన్న కోడలు గయ్యాళి వలె, మరొక సీరియల్‌లో పెద్ద కోడలు బ్రహ్మారాక్షసి వలె, మరోచోట చదువుకున్న కోడలు దుష్టురాలి వలె, ఇంకో సీరియల్‌లో చదువుకున్న అత్తగారు క్రూరురాలి వలె, ఇలా అన్ని సీరియళ్లలో మహిళా ప్రతినాయికల (విలన్) పాత్రలను సృష్టిస్తున్నారు. ఇక వారి చర్యలెలా ఉంటాయం టే.. ఇదివరకే వివాహమైన వ్యక్తికి మరో వివాహం చేయాలని ప్రయత్నించడం, సదరు వ్యక్తి ధర్మచారిణిని తరిమేయాలని పన్నాగాలు పన్నడం.. లాంటి సీన్లు ఎక్కువగా ఉంటాయి. ఏకపత్నీవ్రతుడిగా కీర్తిపొందిన రాముడు కుటుంబాలకు ఇచ్చిన విలువల భరిణ రామాయణం. దాన్ని తునా తునకలు చేయడమే సీరియళ్ల పన్నాగమా లేక పంతమా పురుషుల పాత్రలు మాత్రం సందేశాత్మకంగానే ఉంటాయి. పురుషుల పాత్రలను నోట్లో నాలుక లేని వారుగానో, లేక మరీ మంచితనాన్ని ప్రదర్శించేవారుగానో చిత్రీకరిస్తారు. కానీ, సీరియళ్లలో ఆడవారి మాటలెలా ఉంటాయంటే.. 'అది ఎట్లా చేస్తున్నదో చూడు', 'దాన్ని జుట్టు పట్టు లాగి కొట్టాలి' అనే డైలాగ్‌లు కనిపిస్తుంటాయి. విష ప్రయోగాలు చేయడం, లేదా కాలో, చెయ్యో విరగ్గొట్టి మంచంలో పడేసి, కాపురం చేయకుండా చూడాలని, నూనె డబ్బాలను మెట్ల మీద కుమ్మరించడం, లేదా ఫెన్సింగ్‌కు కరెంటు షాక్ వచ్చేలా అమర్చడం%ౌ% లాంటి సీన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవే కాకుండా చేతబడులు, క్షుద్రపూజలు చేయించడం, మంత్రాలు-తంత్రాలు, మాయలు, మన్ను-మశానం అన్ని ప్రయత్నిస్తుంటారు. ఇలా మూఢనమ్మకాలను పెంచి వందల ఏండ్లు వెనుకకు ప్రేక్షకులను తీసుకుపోవడం మంచిదేనా అసలవన్నీ చూపించవచ్చా నాటక లక్షణాలు వారికి తెలియవా దేన్ని చూపించాలనేది చానళ్లు పాటిస్తున్నాయా నియమ నిబంధనల గురించి చానళ్లకు తెలియదా దర్శక-నిర్మాతలకు తెలియదా

హిందూ వ్యవస్థకు ఉన్న పవిత్రతను పోగొట్టి కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసే సీరియళ్లను చూసినవారు ఏం కావాలి ఎందుకంటే ఫ్యామిలీ టైమ్ అని కలిసి ఫ్యామిలీ రూంలో కూర్చొని టీవీ ఆన్ చేస్తే వచ్చే సీరియళ్లు ఇవే కదా మరి అవి భార్యల సంతృప్తి కోసం కూర్చొని చూస్తారు. ఎలాంటి సంతృప్తి అంటే పిల్లలు ఉద్యోగరీత్యా దూరప్రాంతాల్లో ఉంటే దంపతులు రోజూ బయటకు పోలేరు. కనుక టీవీల్లోనే సమయం గడుపుతారు. అలా ఉపయోగపడుతున్నాయి సీరియళ్లు. అలాంటప్పుడు సీరియల్ అవసరమే కదా అని అంటారేమో సీరియళ్లు ఆపేయాలని కాదు నేను చెప్పేది. అందులో నేరాలు- ఘోరాలు తగ్గించుకుంటే కాస్త మంచిదేమో అని నా అభిప్రాయం. ఒకతను ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు. ఆ విషయం తల్లికి నచ్చదు. తన కొడుక్కి ఎలాగైనా రెండో పెళ్లి చేయాలని, ఆ ఇంట్లో కారణం లేకుండానే ఉండే తమ్ముడి కూతురిని తన కొడుకుకు కట్టబెట్టాలని, అందుకు కోడలిపై ఏదో ఒక నేరం మోపి ఇంట్లోంచి వెళ్లగొట్టాలని, తెగ ప్లాన్లు వేస్తూ ఉంటుంది ఓ అత్త. నిజ జీవితంలో ఎంత కోపమున్నా కూడా ఇలా తన కుటుంబసభ్యులను చావగొట్టాలని చూస్తారా లేదా అంగవైకల్యం వచ్చేలా చేయాలనుకుంటారా ఇలాంటి వాటిని లీనమై చూస్తున్నారు కొంతమంది ప్రేక్షకులు. ఇంకా రేపు ఏం జరుగుతుంది ఆ పిల్ల చస్తుందా లేక దాని కాలు విరుగుతుందా అని ఆడవాళ్లను తిట్టుకుంటూ కొంతమంది మగవారూ చూస్తారు. ఉత్కంఠ రేపి వదిలేస్తారు. సీరియళ్లు వినోదాత్మకంగా ఉండి మనసుకు హాయి కలిగించి సేదతీర్చేలా ఉండాలి. సమాజాన్ని కదిలించేలా చైతన్యవంతమైన కథలతో సందేశాత్మకంగా ఉండాలి. ముఖ్యంగా, ఆడ విలన్లను తగ్గిస్తే మంచిదని నా అభిప్రాయం. ఒకవేళ దుష్ట స్త్రీల గురించి చెప్పాలనుకొంటే మన ఇతిహాసాల్లో, పురాణాల్లో దుష్ట పాత్రలు లేవా వాటి వలె చిత్రీకరించి, ఏది చెప్పినా బుజ్జగించినట్టు చెప్పాలి. ఎందుకంటే ఈ సమాజంలో ఇది వరకే చాలామంది భార్యా బాధితులున్నారు. వారు మరో రకంగా హింసింపబడుతున్నారు. పెళ్లికాని 40 సంవత్సరాల బ్రహ్మచారులు, పెళ్లికాని ప్రసాదులున్నారంటే సర్దుకుపోయే మనస్తత్వం ఉన్న ఆడపిల్లలు కరువయ్యారనే కదా అర్థం! చాలామంది మహిళలు సీరియళ్లకు వ్యసనపరులైపోతున్నారు. వారు ఒక్క రోజు కూడా చూడకుండా ఉండరు. పూర్వకాలంలో విలువలు పట్టు తప్పిపోతున్న ప్రతీసారి ఎవరో ఒక మహాత్ముడు ఆధ్యాత్మిక గురువై తమ బోధనలతో మళ్లీ ఆ విలువలను నిలబెట్టే ప్రయత్నం చేసేవారు. అలా పూర్వం అనసూయ, అరుంధతి లాంటి మునిపత్నులు ఆడవారికి మంచి-చెడుల తారతమ్యం చెప్పి జ్ఞానులను చేసేవారు. వాటిని సీత, ద్రౌపది వంటివారు విని ఆచరించి చూపా రు. అలా ఈ మహిళామణుల స్థానంలో టీవీ చానళ్లు ఆకట్టుకునే సీరియళ్లతో మైత్రీ పూర్వక కథనాలను ప్రదర్శించి, ఆ విలువలను నిలబెట్టాలి. అలా సామాజిక జీవితంలో శాశ్వత విలువలకున్న ప్రాధాన్యాన్ని చెప్పాలనుకుంటే ఎవరినీ కించపరచకుండానే చెప్పవచ్చు. ఉదాహరణకు మందర లాంటి ఆయా పాత్రలకు సముచిత స్థానాన్ని ప్రాముఖ్యాన్ని లోగడ కూడా ఇచ్చేవాళ్లు. ఇప్పుడు కూడా అలా ఇస్తూ సీరియల్ తీయవచ్చు. అప్పుడే నిర్మాతలను అభ్యుదయ నిశ్రేయస్సులని అనవచ్చు.


జీవితంలో రోజు ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం కనుక్కొనేందుకు మంచి మాటలు లేదా మంచి నడవడికతోనే ఎలా చెప్పాలని ఆలోచించాలి. ఎందుకంటే మానవుల పరస్పర బంధాలతో కలిసి చేసే పనులు, నేర్పరితనంతో చేసే పనులకు వీటి వల్ల గండిపడి శాంతిని కోల్పోతారు. మానవ ఐక్యత లోపించి, ఎన్నో కష్టాలకు దారితీస్తుంటాయి. ఇలాంటి వ్యాకులత కలిగించే సీరియళ్ల స్థానంలో పనులు చేసి అలసిపోయిన వారికి ప్రశాంతతను కలిగించే కథనాలను ప్రసారం చేయాలి. ఏ కావ్యం రాసినా, ఏ నవల రాసినా, సాహిత్య ప్రక్రియలో ఏది రాసినా మానవ కల్యాణమే లక్ష్యంగా సాగాలి. అంతే తప్ప ద్వేషాలు- పగ-ప్రతీకారాలతో సీరియళ్లు తీస్తే, రోజూ వాటిని పదే పదే చూపెడితే ఆ ప్రభావం కొద్ది కొద్దిగా మనిషిని మృదు స్వభావం కోల్పోయేలా చేస్తుంది. మొరటుగా మారుస్తుంది. నిజ జీవితంలోనూ సాటివారిని హింసించవచ్చని అనిపించవచ్చు. అప్పుడు ఆ సీరియల్ దుష్ప్రభావం చూపిందనే అనుకోవాల్సి ఉంటుంది. అందరూ అలాంటి అత్తాకోడళ్లే ఉన్నారనుకోవద్దు. అయినా సరదాగా చూసేవారూ ఉన్నారు. కాకపోతే దానికన్నా ప్రమా దం ఏమంటే సీరియళ్లు చూడటం అంటువ్యాధిగా మారడం. ఆ వేళకు బంధువు వచ్చినా పగవాడిగా అనిపిస్తాడు. లేదా తన పిల్లలో, భర్తనో క్రికెట్ చూడాలని రిమోట్ ఇవ్వమంటే వారి మీద వీరికి వచ్చే కోపం అంతా ఇంతా కాదు. ఇలాంటి వారి సంఖ్య ఎక్కువవుతున్నది. టీవీ చానళ్లు ఏదో కాలక్షేపం కోసం హింసా ప్రవృత్తి ఉన్న సీరియళ్లను తీస్తున్నాయిలే అని ఎవరికివారే ఉదాసీనంగా ఊరుకుంటే ఎలా అటువంటి ఫార్ములాతో ఓ సీరియల్ విజయవంతమైందని అనుకోండి! మరో నిర్మాత అలాగే కుట్రలు నిండిన సీరియల్ తీసి దానికి రేటింగ్ పెరిగితే, మళ్లీ నేర ప్రవృత్తి ఉన్న మహిళలను కథా నాయికలుగా చేసి మరో సీరియల్ తీస్తారు. అలా కాకుండా మంచి కథనాలతో ప్రబోధాత్మకంగా, వినోదాత్మకంగా, టీవీ ముందు కొంత సమయం గడిపినా ఏదో ఒకటి నేర్చుకోవడమో, తెలుసుకునేలా సీరియళ్లు ఉండాలి. అప్పుడే మానసిక ఆందోళనలు కలగకుండా ప్రశాంతంగా ఉండవచ్చు

## కోల్‌కతాలో ఎకో-ఫ్రెండ్లీ వెకేషన్ గైడ్‌లైన్స్.. వీటితో టూర్ సాఫీగా..











పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా చరిత్ర, కళ, సంస్కృతి అద్భుతమైన కలయిక. ఈ నగరం దాని మార్కెట్లు, వలసరాజ్యాల వాస్తుశిల్పం, విలాసవంతమైన పండుగలు, స్థిరమైన పర్యాటక రంగానికి ప్రసిద్ధి చెందింది. ఈ నగరంలో ఎకో-ఫ్రెండ్లీ వెకేషన్ చేయవచ్చు. యాత్రను ప్లాన్ చేయడంలో సహాయపడటానికి కొన్ని గైడ్ లైన్స్ మీ కోసం.. పర్యావరణ అనుకూల హోటళ్లను ఎంచుకోండి: ఎకో-ఫ్రెండ్లీ వెకేషన్ గడపడానికి సులభమైన అడుగు ఏమిటంటే, మీకు స్థిరమైన బస ఉండేలా చూసుకోవడం. శక్తి వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను తగ్గించడం, నీటిని సంరక్షించడం లక్ష్యంగా పెట్టుకున్న పర్యావరణ అనుకూల గెస్ట్‌హౌస్‌లు, హోటళ్ళు కోల్‌కతాలో పుష్కలంగా ఉన్నాయి. గ్రీన్ ఎనర్జీ, రీసైక్లింగ్ ప్రోగ్రామ్‌లతో ఉన్న వసతి కోసం చూడండి. కొన్ని హోటళ్ళు సేంద్రీయ భోజనాన్ని కూడా అందిస్తాయి. వాటి అలంకరణ, కార్యకలాపాల కోసం స్థానిక సంస్కృతిని ఉపయోగిస్తాయి. అటువంటి ప్రదేశాలలో బస చేయడం కార్బన్ పాదముద్రను తగ్గించడమే కాకుండా, స్థిరత్వంపై దృష్టి సారించే వ్యాపారాలకు కూడా సహాయపడుతుంది.

పర్యావరణ అనుకూల ప్రజా రవాణా ఎంపికలను పరిగణించండి: కోల్‌కతా పసుపు టాక్సీలు, ట్రామ్‌లు, బస్సులు, కోల్‌కతా మెట్రో వంటి ప్రజా రవాణా వ్యవస్థలతో చాలా అభివృద్ధి చెందింది. మీరు నగరం గుండా ప్రయాణిస్తుంటే ట్రామ్ వ్యవస్థ ఒక గొప్ప మార్గం. ఇది ఆసియాలోని పురాతన ట్రామ్ వ్యవస్థలలో ఒకటి. పర్యాటకులుగా చూడటం కూడా సరదాగా ఉంటుంది. తక్కువ దూరాలకు కారు తీసుకోవడానికి బదులుగా నడవడానికి ట్రై చేయండి చేయండి. కోల్‌కతాలోని అనేక ప్రదేశాలు మైదాన్, విక్టోరియా మెమోరియల్ చుట్టూ ఉన్న అనేక మైదానాలు వంటి నడవడానికి అనుమతిస్తాయి.

పర్యావరణ అనుకూల స్థానిక విక్రేతల నుండి కొనుగోలు చేయండి: కోల్‌కతా చిన్న వ్యాపారాలతో నిండిన నగరం. ఇది చేతివృత్తులవారికి కేంద్రంగా ఉంది. భోజనాల కోసం బయటకు వెళ్ళేటప్పుడు, ముందుగా స్థానిక విక్రేతలు, ఉత్పత్తులను తనిఖీ చేయండి. పర్యావరణ అనుకూల వ్యాపారాలకు మద్దతు ఇవ్వడానికి, సేంద్రీయ, స్థానికంగా లభించే కాలానుగుణ ఆహారాన్ని అందించే ప్రదేశాలలో తినడానికి ప్రయత్నించండి. కోల్‌కతాలోని అనేక రెస్టారెంట్లు వ్యర్థాలను తగ్గించడం, శాఖాహార ఆహారాన్ని అందించడం ద్వారా పర్యావరణ అనుకూల పద్ధతులను అనుసరిస్తున్నాయి. మీరు సావనీర్‌ల కోసం చూస్తున్నట్లయితే, దక్షిణాపన్, న్యూ మార్కెట్‌ను సందర్శించి, జనపనార, బంకమట్టి ఉపయోగించి చేతితో తయారు చేసిన వస్తువులు తీసుకోండి.

పార్కులు, ఉద్యానవనాలను సందర్శించండి: ఇతర మెట్రోపాలిటన్ నగరాల మాదిరిగానే, కోల్‌కతాలో అందమైన ఉద్యానవనాలు పార్కులు ఉన్నాయి. ఇక్కడ తాజా గాలిని ఆస్వాదించవచ్చు. కోల్‌కతాలో మీ దృష్టిని ఆకర్షించే రెండు పార్కులు న్యూ టౌన్‌లోని ఎకో పార్క్, మైదాన్. హౌరాలోని ఇండియన్ బొటానిక్ గార్డెన్ దక్షిణ ఆసియాలోనే అతిపెద్ద, పురాతన బొటానికల్ గార్డెన్‌లలో ఒకటి. గ్రేట్ బన్యన్ ట్రీ వంటి లెక్కలేనన్ని వృక్ష జాతులను కలిగి ఉన్నందున ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తాయి.

పర్యావరణ పర్యటనలు, స్థానిక అనుభవాలు: మీ ప్రయాణాన్ని విలువైనదిగా చేసుకోవడానికి, పర్యావరణ పర్యటనలు లేదా సంరక్షణ లక్ష్యంగా ఉన్న సాంస్కృతిక అనుభవాల గురించి ఆలోచించండి. మీరు కోల్‌కతా నుంచి కొన్ని గంటల దూరంలో ఉన్న సుందర్‌బన్స్‌ను సందర్శించవచ్చు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద మడ అడవులు, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం. ఈ పర్యటనలు ఎక్కువగా ఈ ప్రాంతం ప్రత్యేకమైన జీవవైవిధ్యం, సంరక్షణ గురించి అవగాహన కల్పించడంపై కేంద్రీకృతమై ఉన్నాయి. దుర్గా పూజ వంటి సాంస్కృతిక కార్యక్రమాలను కూడా మీరు జరుపుకోవచ్చు,

# మీకు కోపం ఎక్కువగా వస్తుందా

### నిపుణులు చెప్తున్న టిప్స్ ఇవే!

### మనిషికి కోపం రావడానికి కారణాలనేకం

### దీన్ని ఎలా అదుపులో ఉంచుకోవాలో తెలుసా



ఎదుటి వ్యక్తి ప్రవర్తన నచ్చకపోయినా, చెప్పిన పని చేయకపోయినా, మనతో దురుసుగా మాట్లాడినా, అవమానించినా, మన లక్ష్య సాధనలో విఫలమైనా కోపం రావొచ్చు. మనిషికి ఉండే ఏడు సార్వత్రిక భావోద్వేగాల్లో కోపం ఒకటని నిపుణులు చెబుతున్నారు. కోపం అనేది సమస్య కాదని, దాన్ని ఎలా నియంత్రిస్తాం, వ్యక్తపరుస్తాం అనే దానిలోనే అసలు సమస్య ఉందని చెబుతున్నారు. ఈ క్రమంలో కోపాన్ని ఎలా అదుపులో ఉంచుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం!ఎవరి నుంచైనా ముప్పు పొంచి ఉందని తెలిసిన వెంటనే మనలోని ప్రమాద హెచ్చరిక వ్యవస్థ క్రియాశీలమవుతుందంటున్నారు నిపుణులు. అప్పుడు మన దృష్టి మొత్తం ఆ ముప్పుపై కేంద్రీకృతమవుతుందని చెబుతున్నారు. ప్రాణ రక్షణ స్థితిలో మన దేహం తీవ్రమైన కోపం, హింసాభావంతో నిండిపోతుందని పేర్కొంటున్నారు. మామూలుగా ఆవేశం మన కడుపులో మొదలై, ముఖంపైకి వచ్చి, మనల్ని వికృతంగా ముఖం పెట్టేలా, పిడికిలి బిగించేలా చేస్తుందని పేర్కొంటున్నారు. అరుపు రూపంలో శరీరం నుంచి బయటికి వస్తుందని చెబుతున్నారు. స్వల్పకాలంలో కోపం శక్తివంతమైనదిగా, ప్రతిఫలదా యకంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీని ద్వారా తాను కోరుకున్నది పొందుతానని భావించడం కొందరి క్షణికావేశానికి కారణమంటున్నారు. దీని విపరిణామాల మొదటి లక్షణం సంబంధాలను దెబ్బతీస్తుందని హెచ్చరిస్తున్నారు. చాలా సందర్భాల్లో బంధువులు, మిత్రులు దూరమైపోతారని తెలియజేస్తున్నారు. అది మనల్ని ఒంటరిగా చేస్తుందట. చాలామంది గాయపడతామనే భయంతో, తమను తాము రక్షించుకోలేమేమోనన్న అనుమానంతో, లేదా అన్యాయం జరుగుతుందేమోనన్న భయంతో స్పందిస్తారని వివరిస్తున్నారు.కోప రుగ్మతకు స్పష్టమైన నిర్ధారణ లేదట. కానీ, మానసిక వైద్య నిర్ధారణ మాన్యువల్‌లో దీనిని 'ఇంటర్మిటెంట్ ఎక్స్‌ప్లోసివ్ డిజార్డర్' అని చేర్చారు. ఇది దూకుడు ప్రేరణలను నియంత్రించడంలో వైఫల్యాన్ని సూచిస్తుందంటున్నారు నిపుణులు. పునరావృత ప్రవర్తనా విస్ఫోటనాల ద్వారా వ్యక్తమవుతూ ఉంటుందని చెబుతున్నారు. ఇది కుంగుబాటు, ఆందోళన, పోస్ట్-ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (గాయం), మాదకద్రవ్యాల వినియోగ రుగ్మతలు, మరెన్నో విభిన్న మానసిక ఆరోగ్య సమస్యలలో కనిపిస్తుందని పేర్కొంటున్నారు. అంతే కాకుండా కోపం అనేది నిద్రలేమి సమస్యకూ దారి తీస్తుందన్నారు. ఈ క్రమంలో అనవసరంగా కోపం వచ్చే వాళ్లకు కరోనరీ హార్ట్ డిసీజ్ ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. కోపానికి కారణమయ్యే అంశాలను అంటే పరిసరాలు, వ్యక్తులను గుర్తించి దూరంగా ఉండాలంటున్నారు.భావోద్వేగాలను నియంత్రించుకోడానికి మొట్టమొదటి సూత్రం మనల్ని మనం సంభాళించుకోవాలని తెలియజేస్తున్నారు. ఆ తర్వాత దాన్ని అధిగమించడానికి జ్ఞానం, బలం, ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ఉండాలని చెబుతున్నారు.శ్రమలేని, నెమ్మదైన యోగా లాంటి వ్యాయామాలు కండరాలను సడలించి, ప్రశాంతతను కలిగిస్తాయని పేర్కొంది.కోపాన్ని తగ్గించుకోవడానికి ఉపకరించే వ్యూహాన్ని ఎంచుకోవాలని సూచిస్తున్నారు. ఇందులో శ్వాసను నెమ్మదింపజేయడం, ఊహాత్మక చిత్రాలు చూడటం, మన ఆలోచనలను విశ్లేషించడం, కొంత సమయం తీసుకుని పరిసరాలను మార్చుకోవడం లేదా విశ్రాంతి నైపుణ్యాలను ఉపయోగించడం వంటివి ఉండొచ్చని వివరిస్తున్నారు.మనస్తత్వవేత్తలు కోపానికి పలు థెరపీలు సూచిస్తున్నారు. కాగ్నిటివ్- బి- హేవియర్ థెరపీ, కంపాషన్- పోకస్డ్ థెరపీ వంటివి ఇందులో ఉన్నాయట.

## బ్లాక్ వాటర్ అంటే ఏమిటి ఈ నీటిని తాగడం వలన కలిగే ప్రయోజనాలు ఏమిటంటే..



సెలబ్రిటీల జీవితం గురించి తెలుసుకోవడానికి అభిమానులు చాలా ఉత్సాహాన్ని చూపిస్తారు. సెలబ్రేటీలు ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకూ తినే ఆహారం, తాగే నీరు వరకూ ప్రతి విషయాన్ని తెలుసుకునేందుకు ఆసక్తిని చూపిస్తారు. చాలా మంది సెలబ్రిటీలు బ్లాక్ నీటిని తాగుతూ కనిపిస్తారు. అయితే ఈ బ్లాక్ నీటికి, సాధారణ నీటికి మధ్య తేడా ఏమిటో మీకు తెలుసా ఇది ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందంటే క్రికెటర్లు అయినా, బాలీవుడ్ స్టార్లు అయినా, సెలబ్రిటీలు తమ స్టైల్, ఫిట్‌నెస్, ఆహారపు అలవాట్లకు సంబంధించిన వార్తలతో చర్చల్లోనే ఉంటారు. ఎందుకంటే అభిమానులు సెలబ్రిటీల గురించి ప్రతిదీ తెలుసుకోవాలనుకుంటున్నారు. విరాట్ కోహ్లీ నుంచి శ్రుతి హాసన్ , మలైకా అరోరా వరకు ప్రతి ఒక్కరూ బ్లాక్ వాటర్ తాగడం చూస్తారు. నీరు మన దినచర్యలో ఒక ముఖ్యమైన భాగం. తద్వారా తాగే నీటిలో ఎటువంటి మలినాలు ఉండవు. సహజంగా లభించే నీటిలో కొన్ని ఖనిజాలు కూడా ఉంటాయి. ప్రస్తుతం బ్లాక్ వాటర్ సెలబ్రిటీలలో బాగా ప్రాచుర్యం పొందింది. బ్లాక్ వాటర్ సాధారణ నీటి కంటే ఎందుకు భిన్నంగా ఉంటుంది ఈ రోజు ఆ విషయాలను తెలుసుకుందాం.

సెలబ్రిటీలు బ్లాక్ వాటర్ తాగుతారు. దీని రుచి దాదాపు సాధారణ నీటి మాదిరిగానే ఉంటుంది. అయితే ఈ నీటి ధర కొంచెం ఎక్కువగా ఉంటుంది. ఈ నల్ల నీళ్ళను ప్రత్యేకంగా చూపించేందుకు ఈ నీటిలో పోషక విలువలు వంటి అనేక కారణాలు ఉన్నాయి. ఈ నీళ్ళు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. బ్లాక్ వాటర్ ప్రత్యేకత ఏమిటో తెలుసుకుందాం. స్థాయి తేడా సెలబ్రిటీలు త్రాగే బ్లాక్ వాటర్ ఆల్కలీన్ వాటర్. సాధారణ నీటి 6 నుంచి 7 మధ్య ఉన్నప్పటికీ.. ఈ బ్లాక్ వాటర్ 7 కంటే ఎక్కువగా ఉంటుంది. అంటే 8 లేదా 9. ఇది శరీరంలోని ఆమ్లత్వాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కనుక ఈ వాటర్ ఆమ్ల సమస్యను కలిగించదు. ఇది మీ చర్మానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ఫిట్‌గా ఉండటానికి సహాయపడుతుంది. ఖనిజ లవణాలు ఎక్కువ కొన్ని ఖనిజాలు నీటిలో సహజంగా కనిపిస్తాయి. అయితే నీటిని ఫిల్టర్ చేసినప్పుడు.. కొన్నిసార్లు ఈ ఖనిజాలు నాశనమవుతాయి. బ్లాక్ వాటర్ లో అనేక ఖనిజాలను విడిగా కలుపుతారు. ఇవి శరీరానికి ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. బ్లాక్ వాటర్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటంటే ఆల్కలీన్ బ్లాక్ వాటర్ తాగడం వల్ల శరీరం విషాన్ని తొలగిస్తుంది. దీని %జూ౧% స్థాయి శరీరం నుంచి విషాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. సాధారణ నీటి కంటే బ్లాక్ వాటర్ శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో ఎక్కువ సహాయపడుతుంది. దీనితో పాటు బ్లాక్ వాటర్ వల్ల రక్తంలో చక్కెర నియంత్రణ, మెరుగైన నిద్ర, హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడం వంటి కొన్ని ఇతర ప్రయోజనాలు కూడా పరిగణించబడతాయి. ఎముకలు బలంగా ఉంటాయి. ఇది తెలుసుకోవడం ముఖ్యం బ్లాక్ వాటర్ ఎంత ప్రయోజనకరంగా ఉంటుందనే విషయంపై చాలా పరిమితమైన శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయి. ఈ బ్లాక్ వాటర్ ఎటువంటి వ్యాధిని నయం చేయడంలో సహాయపడదు. ఆల్కలీన్, ఖనిజాల పరిమాణం కారణంగా ఈ నీటిని తాగడం ఆరోగ్యంగా ఉండటానికి ఒక ఎంపికగా మాత్రమే త్రాగవచ్చు. మీకు ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే, మీ ఆహారంలో బ్లాక్ వాటర్‌ను చేర్చుకునే ముందు, ఖచ్చితంగా వైద్యుడిని లేదా సర్టిఫైడ్ డైటీషియన్‌ను సంప్రదించండి.

# ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవాలనుకుంటున్నారా

**సరైన సంస్థను ఎంచుకోండిలా**

**ఇన్సూరెన్స్ పాలసీ కొనుగోలు చేసే ముందు సంస్థ గురించి ఈ విషయాలు తెలుసుకోవాలట**

**తద్వారా భవిష్యత్తులో ఇబ్బంది లేకుండా ఉంటుందట**




ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందో చెప్పలేని పరిస్థితి. అందుకే ప్రస్తుతం చాలా మంది ఆయా అవసరాల దృష్ట్యా రకరకాల ఇన్సూరెన్స్‌లు తీసుకుంటున్నారు. అయితే పాలసీ ఎంత ముఖ్యమో, దాన్ని అందించే కంపెనీ విశ్వసనీయత కూడా అంతే ముఖ్యమంటున్నారు నిపుణులు. ఎందుకంటే సరైన బీమా సంస్థను ఎంచుకోవడం వల్ల పూర్తి బీమా మొత్తాన్ని పొందడంతో పాటు అదనపు ప్రయోజనాలు కూడా లభిస్తాయంటున్నారు. అయితే చాలా మంది పాలసీ కొనుగోలు సమయంలో పరిమిత దృష్టితో ఆలోచిస్తుంటారని చెబుతున్నారు. అంటే కొందరు పాలసీ వల్ల లభించే ప్రయోజనాలపై మాత్రమే దృష్టి పెడితే, మరికొందరు నిబంధనలను పూర్తిగా చదవకుండా కేవలం కంపెనీ పేరును మాత్రమే చూసి నిర్ణయం తీసుకుంటారని చెబుతున్నారు. ఈ రెండు పద్ధతులు కూడా అంత సురక్షితం కాదంటున్నారు. బీమా అనేది దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా ఉండి, మీ కుటుంబ సభ్యులకు విలువైన మెచ్యూరిటీ ప్రయోజనాలను అందించాలంటున్నారు. కాబట్టి, జీవిత బీమా సంస్థను ఎంచుకునే ముందు పరిగణించవలసిన అంశాలు కొన్ని ఉన్నాయంటున్నారు. అవేంటో ఈ స్టోరీలో చూద్దాం ఏదైనా బీమా పాలసీని కొనుగోలు చేసే ముందు వినియోగదారులు ఆ సంస్థకు సంబంధించిన పర్సిస్టెన్సీ రేషియోను తప్పనిసరిగా చూడాలంటున్నారు. ఇది వినడానికి కొంచెం సాంకేతికంగా, కష్టంగా అనిపించినా, ఈ రేషియో ఒక జీవిత బీమా సంస్థకు సంబంధించిన పటిష్టతను, విశ్వసనీయతను ప్రతిబింబిస్తుందని అంటున్నారు. ఒక బీమా సంస్థలో పాలసీలను రెన్యువల్ చేసుకునే కస్టమర్ల సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటే, ఆ కంపెనీ పర్సిస్టెన్సీ రేషియో అంత ఎక్కువగా ఉన్నట్లు చెప్పొచ్చంటున్నారు. పాలసీ పునరుద్ధరణకు పాలసీదారులు ఎంత ఆసక్తి చూపితే, బీమా సంస్థకు సంబంధించిన సేవలతో వారు అంత సంతృప్తిగా ఉన్నారని అర్థమంటున్నారు. ఎందుకంటే, బీమా సంస్థ అందించే మెరుగైన సేవలకు అనుగుణంగానే పాలసీదారులు ప్రతి ఏడాది పాలసీని రెన్యువల్ చేస్తారని.. కాబట్టి, ఎక్కువ మంది పాలసీదారులు పాలసీని పునరుద్ధరిస్తే ఆ సంస్థ పర్సిస్టెన్సీ రేషియో కూడా పెరుగుతుందంటున్నారు. దీంతో ఆ సంస్థ విశ్వసనీయమైందని చెప్పవచ్చని చెబుతున్నారు. కాబట్టి పర్సిస్టెన్సీ రేషియో ఎక్కువ ఉన్న సంస్థలో పాలసీ తీసుకోవడం మేలంటున్నారు.కస్టమర్లు ఒక బీమా సంస్థను ఎంచుకునేటప్పుడు, ఆ సంస్థ కష్ట సమయాల్లో కూడా క్లెయిమ్‌లను విజయవంతంగా చెల్లిస్తుందా లేదా అని తెలుసుకోవాలంటున్నారు. ఉదాహరణకు, కరోనా సమయంలో లేదా ప్రకృతి వైపరీత్యాల్లో చాలా మంది ఒకేసారి క్లెయిమ్‌లు దాఖలు చేయవచ్చు. బీమా సంస్థకు మంచి ఆర్థిక పరిపుష్టి ఉంటే, అది ఎలాంటి ఆలస్యం లేకుండా అన్ని క్లెయిమ్ బాధ్యతలను విజయవంతంగా నెరవేరుస్తుందంటున్నారు. ఇందుకుగానూ బీమా నియంత్రణ సంస్థ) అన్ని బీమా సంస్థల కనీస ద్రవ్యత నిష్పత్తిని నిర్వహించాలని నిర్దేశిస్తుంది నిర్దేశించిన కనీస ద్రవ్యత 1.50. ఒక బీమా సంస్థ ఈ ప్రమాణాన్ని అందుకుంటే భవిష్యత్తులో మెచ్యూరిటీ ముందు, తర్వాత కూడా తమ క్లెయిమ్‌ను పరిష్కరించడానికి ఆ కంపెనీకి అవసరమైన ఆర్థిక బలం ఉందని పాలసీదారుడు నమ్మొచ్చంటున్నారు. భారత్‌లో కొన్ని సంస్థల ద్రవ్య నిష్పత్తి 1.60 నుంచి గరిష్ఠంగా 4.30 వరకు ఉంటోందని చెబుతున్నారు.ఒక నిర్దిష్ట కాలంలో బీమా సంస్థకు వచ్చిన మొత్తం క్లెయిమ్‌లలో, ఆ సంస్థ ఆమోదించినచెల్లించిన క్లెయింల శాతాన్ని క్లెయిం సెటిల్‌మెంట్ నిష్పత్తి సూచిస్తుందని నిపుణులు అంటున్నారు. ఉదాహరణకు, ఒక బీమా సంస్థ క్లెయిం సెటిల్‌మెంట్ నిష్పత్తి 95% అనుకుంటే, ఆ సంస్థకు ఒక నిర్దిష్ట కాలంలో వచ్చిన ప్రతి 100 క్లెయింలలో సగటున 95 క్లెయింలను నిర్ణీత గడువులోగా పరిష్కరించిందని అర్థమంటున్నారు. అయితే ఈ నిష్పత్తిని రెండు విధాలుగా అంచనా వేయాలని చెబుతున్నారు. పరిష్కరించిన క్లెయింల సంఖ్య ఆధారంగానే కాకుండా, మొత్తం క్లెయింల విలువలో వాస్తవానికి ఎంత చెల్లించిందో చూడాలంటున్నారు. ఉదాహరణకు, ఒక బీమా సంస్థ సంఖ్య పరంగా ఆకట్టుకునే 98-99%సెటిల్‌మెంట్ నిష్పత్తిని కలిగి ఉండవచ్చని.. కానీ, అది అనేక చిన్న క్లెయిమ్‌లను చెల్లించి, పెద్ద క్లెయిమ్‌లను తిరస్కరించవచ్చు లేదా తక్కువ మొత్తాన్ని చెల్లించవచ్చంటున్నారు. అలాంటప్పుడు, మొత్తం విలువ పరంగా దాని నిష్పత్తి చాలా తక్కువగా ఉండవచ్చని అంటున్నారు. కాబట్టి ఈ విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలంటున్నారు ప్రతి వ్యాపార సంస్థకు ప్రీమియం రూపంలో ఆదాయమే కాకుండా, నిర్వహణ ఖర్చులు కూడా ఉంటాయంటున్నారు. ఒక బీమా సంస్థ వసూలు చేసే ప్రీమియంలకు అనుగుణంగా తన మెయింటనెన్స్ ఖర్చులను ఎంత సమర్థవంతంగా నిర్వహిస్తుందో అంచనా వేయాలంటున్నారు. బీమా సంస్థకు సంబంధించిన ప్రీమియం ఆదాయంలో ఎంత శాతం జీతాలు, మార్కెటింగ్, కమీషన్లు మొదలైన పరిపాలనా ఖర్చులకు, వ్యాపారాన్ని నడపడానికి సంబంధించిన ఇతర ఖర్చులకు వెచ్చిస్తున్నారో ఈ నిష్పత్తి తెలుపుతుందంచున్నారు. తక్కువ ఖర్చు పెట్టే సంస్థ, ప్రీమియం ఆదాయాన్ని మిగుల్చుకుంటుందని.. దీనివల్ల క్లెయిం పరిష్కారాలకు, పాలసీదారుల ప్రయోజనాల కోసం ఎక్కువ ఆర్థిక వనరులను కేటాయించడానికి వీలుంటుందంటున్నారు. కాబట్టి, నిర్వహణ వ్యయాలు తక్కువ చేసే బీమా సంస్థను ఎంచుకోవడానికి ప్రయత్నించాలంటున్నారు. జీవిత బీమా కంపెనీని ఎంచుకునే ముందు వినియోగదారులు ఫిర్యాదుల పరిష్కార నిష్పత్తిని చూడాలంటున్నారు. ఈ నిష్పత్తి.. కస్టమర్లు ఎన్ని ఫిర్యాదులు చేస్తున్నారు బీమా సంస్థ వాటిని ఎంత సమర్థవంతంగా పరిష్కరిస్తుంది అనే వివరాలను తెలుపుతుందని చెబుతున్నారు. ఒక బీమా సంస్థపై అసాధారణంగా అధిక సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నట్లయితే, దాని పాలసీలుసేవలతో చాలా మంది వినియోగదారులు సంతోషంగా లేరని అర్థమంటున్నారు. ఈ ఫిర్యాదులను పరిష్కరించడంలో బీమా సంస్థ ఎంత సమర్థవంతంగా ఉందనేది కూడా మరో అంశం అంటున్నారు వెబ్‌సైట్ ప్రతి సంవత్సరం ఫిర్యాదుల గణాంకాలను ప్రచురిస్తుందని.. బీమా సంస్థను ఎంచుకునే ముందు ఆ సైట్‌ను చెక్ చేయడం మంచిదంటున్నారు

# మ్యూచువల్ ఫండ్స్ - షేర్లు యంగ్ ఇన్వెస్టర్స్‌కు ఏది బెటర్

**మ్యూచువల్ ఫండ్స్ కన్నా స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసేందుకే యువత ఆసక్తి**

**ఈ రెండీటి మధ్య సరైన సమతుల్యత పాటించడంలోనే పెట్టుబడి విజయ రహస్యం అంటున్న నిపుణులు**




మ్యూచువల్ ఫండ్లకు ఆదరణ పెరుగుతున్నప్పటికీ, చాలా మంది యువ మదుపరులు అధిక రాబడుల కోసం నేరుగా స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గు చూపుతున్నారు. గణాంకాల ప్రకారం, మ్యూచువల్ ఫండ్లు సాధారణంగా 10 శాతం సగటు వార్షిక రాబడి అందిస్తే, షేర్లలో పెట్టుబడి పెట్టడం ద్వారా మాత్రం రాబడి 30 శాతం వరకూ ఉండే అవకాశం ఉంది. స్థిర ఆదాయం లభించే పథకాలతో పోలిస్తే, దీర్ఘకాలంలో ఈక్విటీలు మెరుగైన రాబడులను ఇస్తాయని చెప్పొచ్చు. అయితే కేవలం రాబడిని మాత్రమే చూడటం అసంపూర్ణమే అవుతుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. యువ ఉద్యోగులు తాము ఎంత సంపాదించగలమనే దానికంటే, తమకున్న సమయం, అవగాహన, క్రమశిక్షణతో ఎంత సమర్థంగా పెట్టుబడి పెట్టగలమనేదే ఆలోచించాలంటున్నారు. ఈ రెండీటి మధ్య సరైన సమతుల్యత పాటించడంలోనే పెట్టుబడి విజయ రహస్యం దాగి ఉందని చెబుతున్నారు. ఈ క్రమంలోనే దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.నేరుగా ఈక్విటీలలో పెట్టుబడి పెట్టడం అనేది అత్యంత నష్టభయంతో కూడుకున్నదని, రాబడి అధికంగా వస్తుందనేది తర్వాత విషయమని నిపుణులు చెబుతున్నారు. షేర్ల ఎంపిక, సమయం, క్రమశిక్షణపై రాబడి ఆధారపడి ఉంటుందని వివరిస్తున్నారు. దీని కోసం స్టాక్ మార్కెట్లను నిరంతరం గమనిస్తూనే ఉండాలని, వ్యాపారాలు, రంగాలు, ఆర్థిక పోకడలను అర్థం చేసుకోవడంతోపాటు, మార్కెట్ హెచ్చుతగ్గుల సమయంలో భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం చాలా ముఖ్యమంటున్నారు. ప్రస్తుతం దేశంలో 5,000కు పైగా నమోదిత కంపెనీలున్నాయని, ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న కంపెనీల నుంచి స్థిరమైన లాభాలనిచ్చే వాటిని గుర్తించడం అందరికీ సాధ్యం కాదంటున్నారు. ఉద్యోగం ప్రారంభంలో ఉన్న నిపుణులకు ఇందుకు తగిన సమయం కేటాయించడం సవాలుతో కూడుకున్న పని అని, తగినంత పరిశోధన లేకుండా పెట్టుబడి పెడితే, పొరపాట్లు జరిగే ప్రమాదం ఎక్కువగా ఉందని హెచ్చరిస్తున్నారు.మ్యూచువల్ ఫండ్లలోని పెట్టుబడులను నిపుణులైన ఫండ్ మేనేజర్లు నిర్వహిస్తారని నిపుణులు చెబుతున్నారు. వారు మీ తరఫున పెట్టుబడి నిర్ణయాలు తీసుకుంటారని, డబ్బును వివిధ సాధనాల్లో మదుపు చేస్తారని వివరిస్తున్నారు. సౌలభ్యం, క్రమశిక్షణతో కూడిన పెట్టుబడి (సిప్) వంటి అనేక ప్రయోజనాలను ఫండ్లు అందిస్తాయని.. మ్యూచువల్ ఫండ్ల స్కీములు గణనీయంగా ఉండటంతో, వాటి ఎంపికలో కాస్త జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.మ్యూచువల్ ఫండ్లు పెట్టుబడిని సులభతరం చేస్తాయని పేర్కొంటున్నారు నిపుణులు. ఈక్విటీ ఫండ్ల నిబంధనల ప్రకారం ఫండ్ మేనేజర్లు 70 నుంచి 80 శాతం ఈక్విటీల్లోనే మదుపు చేయాల్సి ఉంటుందని వివరిస్తున్నారు. దీని వల్ల మార్కెట్ పతనాల్లో విక్రయించడానికి లేదా గరిష్ఠ స్థాయిలో కొనడానికి వారు ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుందని, దీనివల్ల మొత్తం రాబడులు తగ్గే ప్రమాదం ఉందంటున్నారు. అంతేకాకుండా, ఫండ్ మేనేజర్లు నిర్ణయాల విషయంలో పారదర్శకత లోపించడం మరో ప్రతికూలత అంటున్నారు. ఏయే షేర్లలో పెట్టుబడి పెడుతున్నారో వెల్లడించినప్పటికీ, ఆ షేర్ల ఎంపిక వెనుక ఉన్న కారణాలను వివరించరని.. ఇది మార్కెట్ గురించి నేర్చుకోవాలనుకునే మదుపరులకు నిరాశ కలిగించే అంశం అంటున్నారు.స్టాక్ మార్కెట్లో విజయం సాధించడం అంటే, కేవలం తెలివితేటలపైనే ఆధారపడి ఉండదంటున్నారు. దానికి సమయం, ఓపిక, భావోద్వేగాల నియంత్రణ అవసరమని హెచ్చరిస్తున్నారు. వ్యాపారాలను విశ్లేషించడం, మార్కెట్ దశలను అర్థం చేసుకోవడం, నష్టాల్లో ఉన్నప్పుడు ప్రశాంతంగా ఉండటం.. ఇవన్నీ అలవాటు చేసుకోవడానికి ఏళ్లు పడుతుందని, త్వరగా పెట్టుబడులు ప్రారంభించడం వల్ల ఈ నైపుణ్యాలను పెంచుకోవచ్చని సూచిస్తున్నారు. దీర్ఘకాలిక సంపదపై దృష్టి పెట్టినప్పుడు మీ పెట్టుబడిలో 70 నుంచి 90 శాతాన్ని మ్యూచువల్ ఫండ్లలో, స్థిరాదాయం కోసం 10-30 శాతాన్ని నేరుగా షేర్లలో మదుపు చేయొచ్చని సలహా ఇస్తున్నారు..

# ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టిన ఫుడ్ పాడైపోయిందా


ప్రస్తుతం కాలంలో ఫుడ్ ఆన్‌లైన్ ఆర్డర్లు పెరిగిపోయాయి. స్విగ్గీ, ఇన్‌స్టామార్ట్, జెప్టో, జొమాటో వంటి ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్ ఫుడ్ డెలివరీలో దూసుకెళ్తున్నాయి. వీటికి భారీగా కస్టమర్లు ఉన్నారు. అయితే ఇటీవలి కాలంలో ఈ ఫుడ్ డెలివరీ యాప్స్‌పై చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో అవి ప్రజల నమ్మకాన్ని కోల్పోతున్నాయని స్పష్టమవుతోంది. అందుకు సజీవ ఉదాహరణ స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కు ఎఫ్ఎస్ఎస్ఏఐ శనివారం తొమ్మిది నోటీసులు జారీ చేయడమే. కుళ్లిన, గడువు ముగిసిన ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు వినియోగదారుల నుంచి వచ్చిన అనేక ఫిర్యాదుల నేపథ్యంలో ఎఫ్ఎస్-ఎస్ఏఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో కస్టమర్లు ఆర్డర్ పెట్టేటప్పుడు పాడైపోయిన ఆహార పదార్థాలు వస్తే ఏం చేయాలి ఎలా, ఎవరికి ఫిర్యాదు చేయాలి తదితర విషయాలు తెలుసుకుందాం పదండి.ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్లపై కస్టమర్లకు తమ హక్కులను తెలియజేయడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోందని ఎఫ్ఎస్ఎస్ఏఐ మాజీ సభ్యుడు బెజోన్ మిశ్రా తెలిపారు. వినియోగదారులకు ఉన్న హక్కులపై అవగాహన కల్పించడానికి, మోసాలను అరికట్టడానికి, వారిని అప్రమత్తం చేయడాన్ని 2005 నుంచి వినియోగదారుల వ్యవహారాల శాఖ ప్రారంభించిన 'జాగో గ్రాహక్ జాగో' మల్టీమీడియా ప్రచారం ప్రభుత్వానికి అతిపెద్ద విజయగాథగా నిలిచిందని అన్నారు. వంట చేసేటప్పుడు నాణ్యత, భద్రతను నిర్ధారించడానికి అన్ని ఆహార పదార్థాల తయారీకి కనీస సమయం అవసరమని అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా ప్రాసెస్ చేసిన ఆహారానికి కోల్డ్ చైన్, నిల్వ, పంపిణీ పద్ధతుల పరంగా కూడా పరిమితులు ఉంటాయని స్పష్టం చేశారు."ఏదైనా ఫుడ్ ఆర్డర్‌లో తప్పు జరిగితే ఎఫ్ఎస్ఎస్ఏఐ హెల్ప్‌లైన్ నంబర్ 1800-112-100కు ఫిర్యాదు చేయాలి.అలాగే ఉదయం 8- రాత్రి 8 గంటల వరకు జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ 1915ను సంప్రదించవచ్చు. ఒకవేళ వినియోగదారునికి ఇంకా పరిష్కారం లభించకపోతే పోర్టల్‌లో ఫిర్యాదు చేయవచ్చు. వినియోగదారులు ఫిర్యాదు చేయడానికి అనేక మార్గాలు ఉన్నాయి. పారదర్శక లైసెన్సింగ్ వ్యవస్థ లేకుండా వ్యాపారం చేయడానికి ఏ అగ్రిగేటర్‌కు, బ్రాండ్ యజమానికి హక్కు లేదు. లైసెన్స్ వివరాలు, దాని చెల్లుబాటు గురించి పూర్తి సమాచారాన్ని అందించే ప్రక్రియకు వినియోగదారులకు ప్రాప్యత కల్పించాలి. అందుకు ఒక సులభమైన పరిష్కారం ఉంది. తమకు సేవలు అందించే సంస్థ గురించి విశ్వసనీయమైన సమాచారాన్ని పొందడానికి, చట్టబద్ధమైన, చట్టవిరుద్ధమైన ఆహార ఉత్పత్తుల మధ్య తేడాను గుర్తించడానికి వినియోగదారులకు ఈ రోజు సాంకేతికత అతిపెద్ద సాధనంగా ఉంది. వినియోగదారులు సరైన నిర్ణయం తీసుకోవడానికి, అలాగే సత్వర పరిష్కారం పొందడానికి, ఫిర్యాదులు చేయడానికి అప్లికేషన్‌లు సులభంగా అందుబాటులో ఉండేలా చూడాలి." అని మిశ్రా పేర్కొన్నారు.అన్ని ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్ దేశ చట్టాలు నిర్దేశించిన ప్రమాణాలను పాటించాలని ఖీూూ× మాజీ సభ్యుడు బెజోన్ మిశ్రా అన్నారు. ఏ యాప్ అయినా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినమైన జరిమానాలు విధించాలని, దానిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. తద్వారా అదే సంస్థ భవిష్యత్తులో ఆహార భద్రత, నాణ్యత, ప్రమాణాలకు సంబంధించి ఇలాంటి తప్పులు చేయకుండా ఉంటుందన్నారు. వినియోగదారులు నాసిరకం, అసురక్షిత ఆహార ఉత్పత్తులను గుర్తించి, అటువంటి విషయాలను సులభంగా ఎఫ్ఎస్ఎస్ఏఐకి నివేదించేలా మద్దతు ఇవ్వాలని కోరారు.జొమాటోతో తన ఎదురైన చేదు అనుభవాన్ని మాస్ కమ్యూనికేషన్ స్టూడెంట్ ముస్కాన్ షేర్ చేసుకున్నారు. "నేను జొమాటోలో చికెన్ బిర్యానీ ఆర్డర్ చేశాను. కానీ ఆ బిర్యానీలోనివి చికెన్ ముక్కల్లా లేకపోవడం చూసి షాకయ్యాను. అవి చాలా భిన్నంగా కనిపించాయి. కుక్క మాంసంలా అనిపించింది. ఆహార భద్రత విషయంలో నాకు భయం వేసింది. అయితే ఆ ఆర్డర్‌కు సంబంధించి నాకు డబ్బు వాపసు వచ్చింది. అయినప్పటికీ ఆ పరిష్కారంతో నేను సంతృప్తిగా లేను. " అని ముస్కాన్ పేర్కొన్నారు.తానొకసారి చికెన్ మీట్‌బాల్స్ ఆర్డర్ చేశానని, అవి తిన్న తర్వాత చాలా వాంతులు అయ్యాయని ఎంబీబీఎస్ విద్యార్థిని దీక్ష తెలిపారు. ఇలాంటి నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఉద్యోగాలు చేసేవారు ఎక్కువగా ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్స్‌పైనే ఆధారపడతారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఫుడ్ క్వాలిటీ దిగజారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కలుషిత ఆహారం తినడం వల్ల ఆనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని ప్రముఖ డైటీషియన్ డాక్టర్ శిఖా శర్మ హెచ్చరించారు. కలుషితమైన లేదా పాడైపోయిన ఆహారం తినడం వల్ల ఫుడ్ పాయిజనింగ్‌కు దారితీయవచ్చని అన్నారు. ఇది ప్రాణాంతకం అవుతుందని పేర్కొన్నారు. సురక్షితమైన ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేయని పాలలో ప్రమాదకరమైన బ్యాక్టీరియా ఉండొొచ్చని అభిప్రాయపడ్డారు. దీంతో ఈ పాలు తాగే శిశువుల కాలేయం, మూత్రపిండాలు దెబ్బతింటాయని హెచ్చరించారు.

# ఈ "ఫ్రీ ట్రయల్" మాయలో మీరు చిక్కుకున్నారా

**ఒకసారి చెక్‌చేయండి**

**మ్యాండేట్‌తో అకౌంట్ కు చిల్లు పెట్టుకుంటున్న వినియోగదారులు**

**ఇలా క్యాన్సిల్ చేసుకోండ**




ఇప్పుడే డబ్బులు కట్టి సర్వీస్ తీసుకో అంటే జనాలు ముందుకు రారు. కానీ, "ముందు ఫ్రీగా వాడి చూడండి, ఆ తర్వాతే నమ్మండి" అని చెప్తే"పోయేదేముందిఓ ట్రయల్ వేద్దాం" అని అనుకునేవారు బోలెడు మంది సరిగ్గా ఇదే ట్రిక్‌ఉపయోగి స్తున్నాయి చాలా కంపెనీలు.ఓటీటీ ప్లాట్‌ఫామ్ మ్యూజిక్ యాప్స్, ఏఐ టూల్స్, క్లౌడ్ స్టోరేజ్ వంటి ఎన్నో డిజిటల్ సేవలు గాలం వేస్తున్నాయి. మరి, నిజంగా ఇది ఫ్రీ ట్రయల్ కాదాఅంటే అది నిజమే. కానీ, అందులోకి వెళ్లడానికి ఇచ్చే "గేట్‌పాస్" దగ్గరే సమస్య వస్తోంది.ఉచిత ట్రయల్ అని చెబుతారు. అది ఎన్ని రోజుల వరకు అమల్లో ఉంటుందో కూడా చూపిస్తారు. కానీ, దాన్ని "టేస్ట్" చేయడానికి ట్రై చేస్తే మాత్రం అనుమతి ఇవ్వాలని అడుగుతారు. ఇప్పుడే డబ్బులు కట్టాల్సిన పనిలేదు. మీరు ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎనీ టైమ్‌క్యాన్సిల్‌చేసుకోవచ్చని చెబుతారు. కానీ, పర్మిషన్‌మాత్రం ముందుగానే ఇవ్వాలంటారు. అప్పుడే ఆ ఫ్రీ ట్రయల్ యాక్సెస్ మీకు లభిస్తుంది.ఈ మెలిక పెట్టడంతో కొందరు వెనక్కు తగ్గినప్పటికీ, మరి కొందరు మాత్రం ముందుకు సాగుతారు. "ఫ్రీ ట్రయల్ ముగిసిన తర్వాత కదా డబ్బులు చెల్లించాల్సింది" అనే ఆలోచనతో "ఓకే.. ఆల్‌రైట్"అని పర్మిషన్ ఇచ్చేస్తారు. ఇలా పర్మిషన్ ఇచ్చిన వారిలో చాలా మంది ఆ విషయమే మరిచిపోతున్నారట. దాంతో ఫ్రీ ట్రయల్ ముగిసిపోయిన తర్వాత బ్యాంకు ఖాతా నుంచి అమౌంట్ కట్‌అవుతోంది. ఆ డబ్బు కట్‌అయిన తర్వాత కొందరు గుర్తిస్తే, రోజూవారీ లావాదేవీలు ఎక్కువగా చేసేవారు ఆ విషయాన్నే గమనించలేకపోతున్నారటఒకవేళ మీ బ్యాంకు ఖాతాలో నగదు నిల్వ లేకపోతే, అప్పటికి అటో డెబిట్ డిక్లైన్ కావచ్చు. కానీ, బ్యాలెన్స్‌మెయింటెయిన్‌చేయనందుకు బ్యాంకులు ఛార్జీలు విధిస్తాయి. కాబట్టి.. కుదిరితే ఈ వైపు నుంచి, కుదరకపోతే ఆ వైపు నుంచి అన్నట్టుగా దెబ్బ పడడం మాత్రం ఖాయం అన్నమాట కాబట్టి.. ఆటో పే మ్యాండేట్ ఇచ్చే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించండి.

# కొత్త "ఇల్లు" కొనే ఆలోచనలో ఉన్నారా

**ఈ విషయాలు తెలియకపోతే ఇబ్బందులు తప్పవట**

**ఇంటి కొనుగోలుకు 'హోమ్ లోన్' తీసుకుంటున్నారా**

**ఈ విషయాలు తెలుసుకోవాల్సిందే అంటున్న నిపుణులు**



సొంతింటి కల అందరికీ ఉంటుంది. దాన్ని నెరవేర్చుకునేందుకు ఎంతో కష్టపడి డబ్బులు పొదుపు చేస్తుంటారు. అయితే, ప్రస్తుతం ఎక్కువ మంది గతంలో మాదిరి ఇంటి నిర్మాణానికి పెద్ద మొత్తంలో డబ్బులు పొదుపు చేసే వరకు వెయిట్ చేయట్లేదు. ఎందుకంటే ఈ రోజుల్లో హోమ్ లోన్స్ సులభంగా అందుబాటులో ఉండడం వల్ల చాలా మంది తమ కెరీర్ ప్రారంభంలోనే, అంటే చాలా ముందుగానే సొంత ఇల్లుఫ్లాట్ కొనుగోలు చేస్తున్నారు. అయితే, హోమ్ లోన్స్ విషయంలో మీ అర్హత ప్రమాణాలు, ఈఎంఐలు ఎప్పుడు ప్రారంభమవుతాయి, పన్ను ప్రయోజనాలు వాస్తవంగా ఎలా వర్తిస్తాయో తెలుసుకోవడం చాలా ముఖ్యంటున్నారు నిపుణులు. మరి, అందుకు సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పుడు చూద్దాం. భారత్‌లో బ్యాంకును బట్టి హోమ్ లోన్ అర్హత ప్రమాణాలు మారుతూ ఉంటాయి. లోన్ కోసం అప్లై చేసే సమయానికి దరఖాస్తుదారుడి కనీస వయసు 21 సంవత్సరాలు, గరిష్ఠంగా 65 సంవత్సరాల లోపు ఉండాలి. స్థిరమైన జాబ్‌ఆదాయ వనరు ఉండాలి. దరఖాస్తుదారుడి ఆదాయం హోమ్ లోన్ మొత్తాన్ని ప్రభావితం చేస్తుంది. లోన్ ఇచ్చే కంపెనీ దరఖాస్తుదారుడి అర్హతను నిర్ధారించడానికి వ్యాపార ఆదాయం లేదా ఇతర ఆదాయ వనరులను కూడా పరిశీలించవచ్చు. ఆదాయ రుజువుగా పే స్లిప్‌లు, ఫారం 16, ఆదాయపు పన్ను రిటర్న్‌లు, బ్యాంకు స్టేట్‌మెంట్లు లేదా ఇతర ఆదాయ సంబంధిత పత్రాలు అవసరం పడుతాయి. అన్నింటికంటే ముఖ్యంగా, వీరికి మెరుగైన క్రెడిట్ స్కోరు చాలా అవసరమంటున్నారు నిపుణులు. బ్యాంకులు 750 కంటే ఎక్కువ స్కోరును మెరుగైందిగా భావిస్తాయని చెబుతున్నారు. హోం ఫైనాన్స్ సంస్థలు లేదా బ్యాంకులు సాధారణంగా నిర్మాణం పూర్తయిన ఇళ్లు, నిర్మాణంలో ఉన్న ఫ్లాట్‌ల కోసం ఇచ్చే లోన్ లను ఒకే విధంగా పరిగణిస్తాయి. డబ్బును ఎలా విడుదల చేస్తారనే దానిలో కీలకమైన వ్యత్యాసం ఉంటుందం టున్నారు నిపుణులు. కొన్ని రుణ సంస్థలు మాత్రమే మీ సొంత భూమిలో స్వీయ నిర్మాణం కోసం ఫైనాన్స్ చేయడానికి సుముఖత చూపుతాయి. అలాంటి సందర్భాలలో, బ్యాంకులు లోన్ పూర్తి మొత్తాన్ని ముందుగానే ఇవ్వవు. మొదట నిర్మాణానికి మీ డబ్బును కట్టాల్సి ఉంటుంది. ఆ తర్వాత, నిర్మాణ పురోగతికి అనుగుణంగా లోన్ ను విడతలవారీగా రిలీజ్ చేస్తాయి. ఫ్లాట్ విషయ ంలోనూ దశలవారీగా బిల్డర్ పేరున చెక్ అందించవచ్చు లేదా వారికి నేరుగా నగదు బదిలీ చేయవచ్చని చెబుతు న్నారు.ఇంటి నిర్మాణం కొనసాగుతున్న కొద్దీ, ప్రతి విడతను విడుదల చేయడానికి మీ ఆర్కిటెక్ట్ లేదా సివిల్ ఇంజనీరు నుంచి నిర్మాణ దశను నిర్ధారించే సర్టిఫికే ట్‌లను సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. నార్మల్‌గా, సైటుకు సంబంధించిన ఫొటోలూ అవసరం అవుతాయి. చాలా బ్యాంకులు కేవలం మీరు చూపించే పత్రాలపై ఆధారపడకుండా, పురోగతిని ధ్రువీకరించడానికి తమ సొంత ఇంజనీరును పంపుతాయి. దీనివల్ల పనులు కొద్దిగా నెమ్మదించినప్పటికీ, బ్యాంకులు ఇదే పద్ధతి పాటిస్తుంటాయంటున్నారు.హోమ్ లోన్ తో మీ సొంత ఇల్లు కొనుగోలు చేయడం మంచిదే, కానీ దీనికి సరైన ప్రణాళిక చాలా అవసరమంటున్నారు నిపుణులు. రుణగ్రహీతల్లో చాలా మంది నిర్మాణం పూర్తయిన తర్వాతే ఇఎమ్ఐ లు ప్రారంభమవుతాయని భావిస్తారు. కానీ, అది నిజం కాదని గుర్తుంచుకోవాలి. ఈఎంఐలు మీ ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు ఆగవు. సాధారణంగా, మొత్తం హోమ్ లోన్ పంపిణీ అయ్యాక రెగ్యులర్ ఈఎంఐలు స్టార్ట్ అయినప్పటికీ, నిర్మాణ దశలో ఇప్పటికే విడుదలైన మొత్తంపై మీరు వడ్డీ చెల్లించాల్సి ఉంటుందంటున్నారు. దీన్ని ప్రీ ఇఎమ్ఐ అంటారు. ప్రీ ఈఎంఐ చెల్లింపులు అసలు మొత్తాన్ని తగ్గించవని గుర్తుంచుకోవాలి. నిర్మాణానికి ఎంత టైమ్ పడుతుందనే దానిపై ఆధారపడి, ఇవి నెలలు లేదా సంవత్సరాల పాటు కొనసాగవచ్చుంటున్నారు.హోమ్ లోన్ పై పన్ను ప్రయోజనాలు మీరు ఎంచుకునే టైమ్ పన్ను విధానంపై ఆధారపడి ఉంటాయని చెబుతున్నారు నిపుణులు. సెక్షన్ 80జ కింద, ఇతర అర్హత గల పెట్టుబడులతో పాటు, అసలు చెల్లింపుల కోసం మీరు సంవత్సరానికి రూ.1.50 లక్షల వరకు క్లెయిమ్ చేయడానికి వీలు ఉంటుంది. నిర్మాణం పూర్తయి, మీరు ఇంటిని స్వాధీనం చేసుకున్నాక సెక్షన్ 24(ఎ) కింద వడ్డీని క్లెయిం చేసుకోవచ్చుంటున్నారు. నిర్మాణ దశలో ప్రీ ఇఎమ్ఐ పై పన్ను మినహాయింపులు ఉండవని గుర్తుంచుకోవాలి. కానీ, నిర్మాణ దశలో మీరు చెల్లించిన వడ్డీ నష్టపోరని గమనించాలి. ఇల్లు పూర్తయ్యాక, ఆ ఏడాదికి కట్టిన సాధారణ వడ్డీతో పాటు, దాన్ని 5 సమాన వాయిదాలలో క్లెయిం చేసుకోవచ్చుంటున్నారు నిపుణులు.స్వయంగా నివసించే ఇళ్ల కోసం, పాత పన్ను విధానం కింద గరిష్ఠ వడ్డీ మినహాయింపులు ఏడాదికి రూ. 2 లక్షలుగా ఉంటుంది. లోన్ తీసుకున్న సంవత్సరం ముగిసినప్పటి నుంచి ఏడేళ్లలోపు నిర్మాణం కంప్లీట్ అవ్వకపోతే, ఈ లిమిట్ రూ.30,000కి తగ్గిపోతుందని గుర్తుంచుకోవాలి. ఒకవేళ మీరు ఇంటిని అద్దెకు ఇచ్చినట్లయితే, మీరు పూర్తి వడ్డీ మొత్తాన్ని క్లెయిం చేసుకోవచ్చుంటున్నారు. కొత్త పన్ను విధానం ప్రకారం, సొంతంగా నివసించే ఇళ్లకు వడ్డీ మినహాయింపు అందుబాటులో లేదు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలంటున్నారు నిపుణులుముఖ్య గమనిక : ఈ ఆర్టికల్‌లో తెలిపిన అంశాలు కేవలం మీ అవగాహన కోసం మాత్రమే. కీలక ఆర్థిక నిర్ణయాలు తీసుకునే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత ఆర్థిక నిపుణుల సలహాలు తీసుకోవడం మంచిది.

# డబ్బు గుంజేందుకే నా పరువు తీశారు: పంజాబ్ కింగ్స్ ప్లేయర్

## తప్పుడు ఎఫ్ఐఆర్‌తో తనను బ్లాక్‌మెయిల్ చేశారన్న శశాంక్ సింగ్

## డబ్బు గుంజడానికే పరువు తీసే కుట్ర జరిగిందని ఆరోపణ

## పనిలో పెట్టుకున్న వ్యక్తికి 9 కేసుల నేర చరిత్ర ఉందని వెల్లడి

## మా వాదన వినకుండానే కేసు నమోదు చేశారంటూ ఆవేదన



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ క్రికెటర్ శశాంక్ సింగ్ తనపై, తన కుటుంబంపై ఇటీవల నమోదైన కేసుపై తాజాగా స్పందించాడు. సెలబ్రిటీగా తనకున్న పేరును దెబ్బతీసి, డబ్బు గుంజేందుకే ఓ వ్యక్తి తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని సంచలన ఆరోపణలు చేశాడు. తనపై దాడి జరిగిందంటూ ఓ వంట మనిషి పెట్టిన కేసు పూర్తిగా కట్టుకథ అని, ఇది పరువు తీసి డబ్బు రాబట్టేందుకు పన్నిన కుట్ర అని సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ పోస్ట్ ద్వారా వివరించాడు.గత నెలలో భోపాల్‌లోని తమ నివాసంలో పనిచేసే వంట మనిషిపై దాడి చేసి, ఫోన్ లాక్కున్నారని శశాంక్ సింగ్, ఆయన తండ్రి, రిటైర్డ్ స్పెషల్ డీజీపీ శైలేష్ సింగ్‌పై రతిబాద్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను శశాంక్ పూర్తిగా ఖండించాడు. "నిజానిజాలు తెలుసుకోకుండా వేలమంది నన్ను దూషించారు. ఒక నిరుపేదను కొట్టిన వ్యక్తిగా నన్ను చిత్రీకరించారు. ఈ ఘటన నన్ను మార్చేసింది, జీవితాంతం గుర్తుంచుకునే పాఠాలు నేర్పింది" అని ఆవేదన వ్యక్తం చేశాడు.తమ వద్ద పనికి చేరిన వ్యక్తి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండేదని, ఇంట్లో తిరుగుతూ ఫొటోలు తీసి ఇతరులకు పంపేవాడని శశాంక్ తెలిపాడు. దీంతో మూడో రోజే అతడిని పనిలో నుంచి పంపించేశామని, అప్పుడు అతను ఆరోగ్యంగానే వెళ్లాడని స్పష్టం చేశాడు. "ఆ తర్వాత అతడు తీవ్రంగా గాయపడినట్లు వీడియోలో చూసి మేం షాక్ అయ్యాం. పోలీసు రికార్డుల ప్రకారం అతనిపై అప్పటికే హత్యాయత్నం, గృహ చౌర్యం, దాడి, బెదిరింపులు, ఎస్సీ/ఎస్టీ చట్టం కింద కేసులు సహా మొత్తం 9 ఎఫ్ఐఆర్‌లు నమోదై ఉన్నాయి. తన గుర్తింపును దాచుకోవడానికి మూడు వేర్వేరు పేర్లు వాడుతున్నాడు" అని శశాంక్ వెల్లడించాడు.ఒక తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా తనపై ఒత్తిడి తెచ్చి, డబ్బు రాబట్టుకోవాలన్నదే అతని ప్రణాళిక అని తాను నమ్ముతున్నానని శశాంక్ పేర్కొన్నాడు. "సాధారణ బాధితులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికే ఇబ్బంది పడుతుంటే, మా వైపు వాదన వినకుండానే ఇంత వేగంగా కేసు ఎలా నమోదు చేశారని ఆశ్చర్యపోయాను" అని అన్నాడు. ఏప్రిల్ 30న కూడా తాను ఇలాంటి పనే చేశానని వస్తున్న వార్తలను కొట్టిపారేశాడు. ఆ రోజు తాను ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్నానని, కనీస నిజ నిర్ధారణ లేకుండా వార్తలు రాసి పరువు తీస్తున్నారని విమర్శించాడు.ఈ అనుభవంతో కొన్ని కఠినమైన పాఠాలు నేర్చుకున్నానని చెబుతూ, ప్రజలకు శశాంక్ ఒక ముఖ్యమైన సూచన చేశాడు. "ఇంట్లో పనిచేసే వారిని నియమించుకునే ముందు రిజిస్టర్డ్ ఏజెన్సీల ద్వారా, పూర్తి పోలీసు వెరిఫికేషన్ తర్వాతే తీసుకోవాలి. జాలి అనేది ఇంగితజ్ఞానాన్ని భర్తీ చేయకూడదు. సత్యానికి సమయం పట్టినా, చివరికి అదే గెలుస్తుంది" అని చెప్పుకొచ్చాడు.

# భారత జట్టులో భారీ మార్పులు.. గంభీర్ నమ్మిన బంటులపై వరుసగా వేటు?





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జట్టు ఓటముల పరంపర కొనసాగుతున్న వేళ తెరవెనుక మరో పెద్ద సంక్షోభం స్టార్ట్ అయింది. ఐర్లాండ్ చేతిలో 2--0తో, ఇంగ్లాండ్ చేతిలో 4--0 తేడాతో టీ20 సిరీస్‌లను ఘోరంగా ఓడిపోవడంతో.. ఇండియా కోచింగ్ స్టాఫ్‌లో అనిశ్చితి నెలకొంది. జట్టు ప్రదర్శనపై బీసీసీఐ త్వరలోనే రివ్యూ మీటింగ్ నిర్వహించనుండగా, ఆలోపే హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు బిగ్ షాక్ తగిలింది. గంభీర్ కి ఎంతో నమ్మకంగా జట్టులోకి తీసుకున్న సపోర్ట్ స్టాఫ్?లోని ఇద్దరు తప్పుకోవాలని చూస్తున్నారు. ప్రస్తుత ఇంగ్లాండ్ టూర్ ముగిసిన వెంటనే అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డోస్కాట్, ఫాస్ట్ బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ భారత్‌ను వీడబోతున్నట్లు తెలుస్తుంది.

**భారత్‌ని వీడి ఐపీఎల్‌లోకి:**

గత 2024లో గౌతమ్ గంభీర్ భారత జట్టుకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు, ఈ ఇద్దరు కోచ్‌లు జట్టులో జాయిన్ అయ్యారు. ఇండియన్ బౌలింగ్, బ్యాటింగ్ విభాగాలను బలోపేతం చేయడం కోసం గంభీర్ స్వయంగా వీరిద్దరిని తుది జట్టులోకి తీసుకున్నాడు. కానీ, ర్యాన్ టెన్ డోస్కాట్ టీమిండియాతో కొనసాగడానికి అంతగా ఇంట్రెస్ట్ చూపించలేదు.. ఏడాది పాటు జట్టుతో కలిసి ప్రయాణించిన తనకు ఇబ్బందిగా మారిందని ఆయన బీసీసీఐకి తెలిపినట్లు టాక్. దీనికి తోడు ఆయన ఒక ప్రముఖ ఐపీఎల్ ఫ్రాంచైజీతో కోచింగ్ పదవి కోసం చర్చలు జరుపుతున్నట్లు వార్త కథనాలు నడుస్తున్నాయి. మరోవైపు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కూడా వన్డే సిరీస్ ముగిసిన తర్వాత తన భవిష్యత్తుపై తుది నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉంది.

**జింబాబ్వే టూర్‌కు గంభీర్ ఔట్:**

ఇంగ్లండ్ టూర్ ముగిసిన వెంటనే ఇండియన్ టీమ్ జూలై 2026 చివరి వారంలో జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. అక్కడ జింబాబ్వేతో 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. జూలై 23న మొదటి టీ20, జూలై 25న రెండో మ్యాచ్, జూలై 26న మూడో మ్యాచ్ జరగనున్నాయి. కానీ, ఈ జింబాబ్వే పర్యటనకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ని బీసీసీఐ తప్పించింది. అతడికి రెస్ట్ ఇవ్వాలని బోర్డు భావిస్తోంది. గంభీర్ స్థానంలో నేషనల్ క్రికెట్ అకాడమీ చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్ ఈ టూర్ కి తాత్కాలిక హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు.

**శ్రీలంక టూర్ కి కొత్త బౌలింగ్ కోచ్:**

ఒకవేళ మోర్నీ మోర్కెల్, ర్యాన్ టెన్ డోస్కాట్ ఇద్దరూ జట్టు నుంచి తప్పుకోవాలని ఫిక్స్ అయితే, బీసీసీఐ చాలా వేగంగా స్పందించాల్సి ఉంది. ఎందుకంటే ఆ వెంటనే శ్రీలంక పర్యటనకు టీమిండియా వెళ్లబోతుంది. ఆగస్టు 2026లో జరగబోయే ఈ శ్రీలంక టూర్ లో ఇండియా రెండు టెస్టుల సిరీస్ ఆడబోతుంది. ఆగస్టు 15వ తేదీన గాలే వేదికగా మొదటి టెస్ట్, ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబో వేదికగా రెండో టెస్ట్ జరగనున్నాయి. మోర్కెల్ లేకపోతే, ప్రస్తుతం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా ఉన్న టీమిండియా మాజీ పేసర్ లక్ష్మీపతి బాలాజీని శ్రీలంక టూర్‌కు తాత్కాలిక బౌలింగ్ కోచ్‌గా పంపడానికి బీసీసీఐ యోచిస్తుంది.

**ఫీల్డింగ్ కోచ్ టీ.దిలీప్‌పైనా వేటు?**

భారత్ వరుస పరాజయాలతో కేవలం అసిస్టెంట్, బౌలింగ్ కోచ్‌లు మాత్రమే కాదు, ఫీల్డింగ్ కోచ్ దిలీప్ పోస్టుపై కూడా కత్తి వేలాడుతుంది. గత కొంతకాలంగా ఇండియన్ టీమ్ ఫీల్డింగ్ ప్రమాణాలు భారీగా పడిపోవడంతో.. బోర్డు ఆయనపై కూడా అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. మొత్తం మీద గంభీర్ కోచింగ్ టీమ్‌లోని సభ్యులు తప్పుకోవడానికి రెడీ కావడం, మరికొందరిపై బీసీసీఐ వేటు వేసేందుకు సిద్ధమైంది. రాబోయే రోజుల్లో టీమిండియా సపోర్ట్ స్టాఫ్ పూర్తిగా మారిపోయే ఛాన్స్ కనిపిస్తున్నాయి.

# 230 కోట్ల ఆస్తిపరుడైనా సాధారణ జీవితం!





కోలీవుడ్ అత్యంత ప్రతిభావంతులైన నటులలో ధనుష్ ఒకరు. నటుడిగా, గాయకుడిగా, గీత రచయితగా, దర్శకుడిగా , నిర్మాతగా పరిశ్రమలో తనదైన ముద్ర వేసారు. కెరీర్ ఆరంభం నుండి గ్లోబల్ స్టార్ స్థాయి వరకు ఆయన ఎదిగిన విధానం ఎంతో స్ఫూర్తిదాయకం. అంతేనా 230 కోట్ల రూపాయల ఆస్తిపరుడు. విలాసవంతమైన జీవనశైలి తో పాటు అత్యంత సంపన్న నటులలో ఒకరిగానూ నిలుస్తున్నారు. ధనుష్ ఆస్తుల విషయానికి వస్తే ఆయనకు చెన్నైలోని ప్రతిష్టాత్మకమైన పోయెస్ గార్డెన్‌లో 150 కోట్ల రూపాయల విలువైన బంగ్లా ప్రధానాకర్షణగా నిలుస్తుంది. అత్యంత భద్రత .. ఆధునిక సదుపాయాలతో కూడిన ఈ భవనం నగరంలోని అత్యంత ఖరీదైన నివాస ప్రాంతాల్లో ఒకటి. అంతే కాదు అళ్వార్‌పేట ప్రాంతంలో 18 కోట్ల రూపాయల విలువైన మరొక లగ్జరీ బంగ్లా కూడా ఉంది. రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు ఆయన ఆర్థిక భవిష్యత్తుపై ఉన్న దూరదృష్టిని తెలియజేస్తున్నాయి. వాహనాల విషయానికి వస్తే ధనుష్‌కు లగ్జరీ కార్లంటే ఎంతో ఇష్టం. సేకరణలో రోల్స్ రాయిస్ ఘోస్ట్, రోల్స్ రాయిస్ స్పెక్టర్ , బెంట్లీ కాంటినెంటల్ జిటి , ఫోర్డ్ ముస్టాంగ్ వంటి అత్యంత ఖరీదైన వేగవంతమైన వాహనాలున్నాయి. 7.5 కోట్ల రూపాయల విలువైన రోల్స్ రాయిస్ స్పెక్టర్ ఎలక్ట్రిక్ సెడాన్‌ను ఇటీవల కొనుగోలు చేసారు. ఆధునిక సాంకేతికత .. విలాసం పట్ల ఆసక్తిని చాటి చెబుతోంది. ధనుష్ ఒక్కో చిత్రానికి 20 నుంచి 35 కోట్ల రూపాయల వరకు పారితోషికం తీసుకుంటారు. బ్రాండ్ ఎండార్స్‌మెంట్ల ద్వారా కూడా భారీగా ఆర్జిస్తున్నారు. ప్రతి నెలా సుమారు 3 కోట్ల రూపాయల మేర ఆదాయాన్ని పొందుతుంటారని అంచనా. అంతర్జాతీయ చిత్రాల్లో నటించడం, సొంత నిర్మాణ సంస్థ వుండర్‌బార్ ఫిలిమ్స్ ద్వారా చిత్రాలను నిర్మించడం వంటివి ధనుష్ ఆర్థిక మూలాలను మరింత బలోపేతం చేస్తున్నాయి.అంతటి సంపద, విలాసాలు ఉన్నా? ధనుష్ వ్యక్తిగతంగా చాలా సాధారణంగా ఉంటుంది. బయటకు వెళ్లాలంటే పలానా బ్రాండ్ కారు ఉండాలని లేదు. ఆ సమయానికి ఏది అందుబాటులో ఉంటే అందులో వెళ్లిపోతారు. షూటింగ్ సమయంలో ఎలాంటి పరిస్థితులున్నా? సర్దుకుపోవడం ధనుష్ ప్రత్యేకతగా చెబుతున్నారు. అలాగే పనిపై చూపే నిబద్ధత ..క్రమశిక్షణే ధనుష్ ని ఈ స్థాయికి చేర్చాయి. దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో కొనసాగుతున్నా? ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటారు. ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా తనను తాను మలచుకోవడం ధనుష్ ప్రత్యేకత. ఆస్తులు ఎంతటివైనా? తన నటనతో ప్రపంచవ్యాప్తంగా అభిమానుల మనసుల్లో ఆయన సంపాదించుకున్న గుర్తింపు అన్నిటికంటే మిన్న. ఆర్థికంగా ఎంత ఎదిగినా? కళాత్మక విలువలను వదులుకోకుండా, నటుడిగా , దర్శకుడిగా కొత్త శిఖరాలను అధిరోహించడం ధనుష్ గొప్పతనం.

నాభా నటేష్ 'గోల్డెన్ అవర్' గ్లామర్ - కెరీర్, అరంగేట్రం రాబోయే చిత్రాలు



స్టైలిష్ ఫోటోషూట్ లుక్‌లో ఐశ్వర్య రాజేష్ ఆకర్షణీయ మైన రూపం

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com